నీలగిరి నిత్యపద్యం
ఆటవెలది

మేడనుండువాడు నాడునబద్ధము
నిజమునననుచుతలచు నిలను జనులు
పాకలోనివాడు పాటించు సత్యమ్ము
లెక్కచేయరుర్వి నొక్కరైన

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు, కవి

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 118 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 27-7-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00




## అత్యంత విశ్వసనీయ నేతగా మోడీ

- పపంచంలో అగ్రనేత గా ర్యాంకింగ్
- మోడీ దరిదాపుల్లో లేని ప్రపంచ నాయకులు
- ఎనిమిదో స్థానానికి పడిపోయిన డోనాల్డ్ ట్రంప్
- రెండో స్థానంలో దక్షిణ కొరియా డీజే మ్యుంగ్
- మూడు నాలుగు ప్లేస్లలో అర్జెంటీనా, కెనడా అధిపతులు

న్యూఢిల్లీ

ప్రపంచంలో అత్యంత విశ్వసనీయ నేతగా ప్రధాని మోదీ మరోసారి టాప్‌లో నిలిచారు. మార్నింగ్ కన్సల్ట్ సంస్థ గ్లోబల్ లీడర్ సర్వేలో మరోసారి తన ఆధిక్యాన్ని నిలుపుకున్నారు. సర్వేలో ప్రధాని మోదీకి అత్యధిక శాతం మంది మద్దతు ప్రకటించడంలో అప్రూవల్ రేటింగ్స్ ఏకంగా 75 శాతానికి చేరాయి. ఈ ఏడాది జులై 4 నుంచి 10 తేదీల మధ్య సర్వేను -మిగతా 2 లో



# జైపాల్ రెడ్డి పాత్ర ఎన్నటికీ మరువలేనిది

తెలంగాణ ఏర్పాటులో జైపాల్ రెడ్డి కీలక భూమిక

- సిద్ధాంత రాజకీయాలు లేవు..స్విగ్గీ పాలిటిక్స్ నడుస్తున్నాయ్
- సిద్ధాంత రాజకీయాలకు కట్టుబడ్డ నేత జైపాల్
- జైపాల్ రెడ్డి డెమక్రసీ అవార్డు ప్రదాన కార్యక్రమంలో సిఎం రేవంత్



హైదరాబాద్,-

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో దివంగత నేత జైపాల్ రెడ్డి పాత్ర ఎన్నటికీ మరువలేనిదని, ఆయన సహకారం లేకుంటే పృతేక రాష్ట్రం వచ్చేది కాదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో ఆయన సమయస్ఫూర్తి ఎంతో పనికొచ్చిం దన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జైపాల్ రెడ్డి ఎంతో చొరవ చూపారని సోనియా గాంధీ కూడా ఓసారి చెప్పారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. శనివారం హైదరాబాద్‌లో క్యాపిటల్ ఫౌండేషన్ సొసైటీ-, ఇక్ఫై నిర్వహించిన ఎస్. జైపాల్ రెడ్డి స్మారక అవార్డు కార్యక్రమంలో -మిగతా 2 లో

# రేవంత్ కట్టుబానిసలుగా పోలీసులు


వారు గడ్డి తింటున్నారా..అన్నం తింటున్నారా



- తెలంగాణలో పోలీసు వ్యవస్థ ఘోరం
- పభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారో కనుక్కోవడమే పోలీసుల పని
- మా ప్రభుత్వం రాగానే వారి లెక్కలు తేలుస్తాం
- బీఆర్ఎస్వీ సభలో కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్,-

తెలంగాణలో పోలీసు వ్యవస్థ ఘోరంగా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్లకుంట్ల తారక రామారావు ఆరోపించారు. ఎవరు సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారో కనుక్కోవడమే పోలీసుల పనిగా మారిందని విమర్శించారు. పోలీసుల మెడకాయపైన తలకాయ ఉన్న పనే చేస్తున్నారా అని నిలదీశారు. పోలీసులు అన్నం తింటున్నారా? గడ్డి తింటున్నారా? అని ప్రశ్నించారు. తెలంగాణ పోలీసులు రేవంత్ రెడ్డి కట్టుబానిసలుగా పనిచేస్తున్నారని -మిగతా 2 లో



## స్వచ్ఛమైన గాలి పీల్చిన ఢిల్లీ..

- మెరుగుపడిన ఢిల్లీలో వాయు నాణ్యత
- జూలైలో 67 ఏక్యూఐ రికార్డు

న్యూఢిల్లీ-

వాతావరణంలో మార్పులు.. ఢిల్లీకి ఊరటను తీసుకొచ్చాయి. చాన్నాళ్ల తర్వాత ఢిల్లీలో వాయు నాణ్యత మెరుగుపడింది. ఈ ఏడాది జూలైలో దేశ రాజధానిలో ఎయిర్ క్వాలిటీ ఇంప్రూవ్ అయ్యింది. వాయు నాణ్యత సంతృప్తికర కేటగిరీలో నమోదు అయ్యింది. ఢిల్లీలో ఈ కేటగిరీలో ఎయిర్ క్వాలిటీ చూపించడం చాలా అరుదైన విషయం. జూలై 23వ తేదీన సిటీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్(ఏక్యూఐ) కేవలం 67గా నమోదు అయ్యింది. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు ప్రకారం 67 ఏక్యూఐ అనేది సంతృప్తికరమైంది.సాధారణంగా ఢిల్లీలో వాయు కాలుష్యం ఎక్కువ. ఫ్యాక్టరీలు, వాహనాలు, పంట కాలుష్యంతో -మిగతా 2 లో



## కాంగ్రెస్ బీసీ పాలిటిక్స్ పేరుతో మోసం

- నేతలకన్నా పార్టీయే సుప్రీం
- బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు

మహబూబ్ నగర్-

బీజేపీలో ఎంత పెద్ద నాయకుడైన సరే పార్టీనే సుప్రీమని తెలంగాణ బీజేపీ చీఫ్ రామచందర్ రావు స్పష్టం చేశారు. పార్టీ ముందు అంతా ఒక్కటేనని అన్నారు. శనివారం రామచందర్ రావు మహబూబ్ నగర్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎమ్మెల్సీగా నన్ను గెలిపించిన పాలమూరు ప్రజలకు ఎప్పటికీ రుణపడి -మిగతా 2 లో

## గోవా గవర్నర్‌గా అశోక్‌గజపతి ప్రమాణం

- హాజరైన లోకేశ్ పలువురు టిడిపి నేతలు




పనాజి,-

గోవా గవర్నర్‌గా పూసపాటి అశోక్ గజపతిరాజు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే ఉదయం 11.30 గంటలకు రాజ్‌భవన్ బంగ్లా దర్బార్ హాల్‌లో అశోక్ గజపతిరాజుతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎపి మంత్రులు నారా లోకేష్, సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు- పలువురు టిడిపి ఎంపీలు హాజరయ్యారు. -మిగతా 2 లో



## మావోయిస్టులకు ఎదురుదెబ్బ..

- ఎన్‌కౌంటర్‌లో నలుగురు హతం..!

ఛత్తీస్‌గఢ్-

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు ఎదురుదెబ్బ తగిలింది. బీజాపూర్‌లో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించారు. మావోయిస్టుల ఉనికి గురించి సమాచారం నేపథ్యంలో భద్రతా బలగాలు తనిఖీలు చేపట్టాయి. ఈ క్రమంలో అటవీ ప్రాంతంలో కాల్పులు జరిగాయని బస్తర్ రేంజ్ ఐడీ సుందర్‌రాజ్ పీ తెలిపారు. కాల్పులు జరిగిన ప్రాంతం నుంచి ఇప్పటి వరకు నలుగురు మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇంకా కాల్పులు -మిగతా 2 లో

## పోలీసులపై కేసుల విచారణలో జాప్యం ఎందుకు....
# ఎంతైనా మనోళ్లేననా..?

- పోలీసు అధికారులపై విచారణల్లో జాప్యం
- పైకి చర్యలు తీసుకుంటామంటున్నా శాఖకు అప్రతిష్ట అనే ఆలోచనతో లోలోపల మాత్రం అన్ని తప్పిదాలే

హైదరాబాద్,జులై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

ఎవరైనా పోలీస్ స్టేషన్కు న్యాయం జరుగుతుందనే వెళతారు. కానీ కొన్ని ఠాణాల్లో జరిగే తీవ్ర జాప్యం వల్ల అమాయకులు నష్టపోతున్నారు. వారికి జరగాల్సిన న్యాయం అనేది నిందితులకు జరగడంతో ఏం చేయాలలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. వీరిలో కొంతమంది పోలీసులు డబ్బులకు కక్కుర్తిపడితే, మరికొందరు మహిళల వ్యామోహంలో పడి ఇలాంటి పనులకు రెడీ అవుతున్నారు. ధైర్యం చేసి ముందుకు వచ్చిన బాధితులు ఉన్నతాధికారులకు -మిగతా 2లో






## ఆందోళనకరంగా ఏపీ ఆర్థిక పరిస్థితి

కాగ్ నివేదికను ప్రస్తావిస్తూ ఎక్స్‌లో పోస్ట్



అమరావతి,

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై మాజీ సీఎం వైఎస్ జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదాయాలు లేకపోగా, శరవేగంగా అప్పులు పెరగటంపై జగన్ ఫైర్ అయ్యారు ఈ సందర్భంగా కాగ్ నివేదికను తన సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. ప్రభుత్వ విధానాలతో రాష్ట్రం మరింత అప్పుల్లో కూరుకుపోయింది.. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలోనే రాష్ట్రంపై తీవ్రమైన ఆర్థిక ఒత్తిడి ఏర్పడింది.. ఈ విషయాన్ని కాగ్ తన నివేదికలోనే స్పష్టం చేసింది.. రాష్ట్రంలో ఆర్థిక స్థిరత్వం, నిర్వహణ సరిగా లేనేలేదు.. రాష్ట్ర విభజనతో మొదలైన సమస్య మరింత తీవ్రరూపం దాల్చింది -మిగతా 2 లో

# జైపాల్ రెడ్డి పాత్ర ఎన్నటికీ మరువలేనిది

(మొదటి తరువాయి)

ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ప్రముఖ ఆర్థిక నిపుణులు మోహన్ గురుస్వామికి జైపాల్ రెడ్డి డెమొక్రసీ తొలి అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. జైపాల్ రెడ్డికి ప్రతిపక్ష పార్టీలతో కేవలం సిద్ధాంతపరంగా మాత్రమే విభేదాలు ఉండేవని, రాజకీయాల్లో ఆయన 40 ఏళ్ల పాటు– అజాతశత్రువుగా ఉన్నారని కొనియాడారు. సమాచార హక్కు చట్టం రావడంలో జైపాల్ రెడ్డి పాత్ర ఎంతో ఉందన్నారు. సంస్కరణల అమలుకు జైపాల్ రెడ్డి ఎంతో తాపత్రయపడేవారన్నారు. కల్వకుర్తి ప్రాంతంలో మార్పుల కోసం జైపాల్ రెడ్డి ఎంతో కృషి చేశారని అన్నారు. తెలంగాణ నుంచి పీవీ నర్సింహా రావు తర్వాత అంత పేరు తెచ్చుకున్నది జైపాల్ రెడ్డి మాత్రమేనన్నారు. రాజకీయాల్లో ధన ప్రవాహం తగ్గాలని జైపాల్ రెడ్డి చెప్తుండేవారని ఆయన నమ్మిన సిద్ధాంతాన్ని మేం ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. వ్యక్తిగత రాజకీయాలకంటే సిద్ధాంతపరమైన రాజకీయాలు ముఖ్యమన్నారు. ప్రస్తుతం ఐడియోలాజికల్ పాలిటిక్స్ పోయి స్విగ్గీ పాలిటిక్స్ వచ్చాయని.. సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసేవాళ్లు దేశ రాజకీయాల్లో తగ్గుతూ వస్తున్నారని.. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదమని అభిప్రాయపడ్డారు. యూనివర్శిల నుంచే సిద్ధాంత పరమైన రాజకీయాలు తయారు అవుతాయని పేర్కొన్నారు. జైపాల్‌రెడ్డి నమ్మిన సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇవాళ రాజకీయాలు ప్రమాదకరమైన దిశలో వెళ్తున్నాయి. ప్రజాస్వామిక విలువలు తగ్గి.. పొలిటికల్ మెనేజ్‌మెంట్ పెరిగిందని రేవంత్‌రెడ్డి అన్నారు. నాటి ఐడియాలజికల్ పాలిటిక్స్ పోయి ఇవాళ స్విగ్గీ పాలిటిక్స్ వచ్చాయని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన చెందారు.. దేశ రాజకీయాల్లో సైద్ధాంతిక రాజకీయాలు పోయి, మేనేజ్మెంట్ పాలిటిక్స్ కీరోల్ ప్లే చేస్తున్నాయని అభిప్రాయపడ్డారు. కార్యకర్తలు పోయి వాలంటీర్ వ్యవస్థ వస్తోందన్నారు. కార్యకర్తలు లేని రాజకీయాలు దేశ భవిష్యత్ కు ప్రమాదకరమన్న రేవంత్.. యూనివర్సిటీలలో విద్యార్థి రాజకీయలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు.దేశ రాజకీయాల్లో ధన ప్రవాహం తగ్గించాల్సిన అవసరం ఉందని, ప్రతిపక్షాలు సహేతుకమైన సూచన చేస్తే తీసుకోవడానికి మాకు ఇబ్బంది లేదని రేవంత్ స్పష్టం చేశారు. అందుకే తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు శాసనసభ నుంచి ఎవరినీ సస్పెండ్ చేయలేదని కూడా రేవంత్ రెడ్డి చెప్పారు.

# రేవంత్ కట్టుబానిసలుగా పోలీసులు

(మొదటి తరువాయి)

షాకింగ్ కామెంట్స్ చేశారు. తెలంగాణ పోలీసులపై సంచలన వ్యాఖ్యలు చేశారు. పోలీసులు చేయాల్సిన పని ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన బీఆర్ఎస్వీ సభలో కేటీఆర్ ప్రసంగించారు. అధికారం శాశ్వతం కాదని.. రేవంత్ బానిసలుగా పని చేస్తున్న ఒక్కో పోలీసు పేరు రాసి పెట్టుకోవాలని బీఆర్ఎస్ శ్రేణులకి పిలుపునిచ్చారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని లెక్కలు వడ్డీతో సహా కలిపి చెల్లిస్తామని హెచ్చరించారు. బనకచర్ల ప్రాజెక్ట్ ఆపేదాక తాము పోరాటం చేస్తామని ఉద్ఘాటించారు. తెలంగాణ నీటి వాట మనకి ఇచ్చిన తర్వాత ఎవరూ ఏ ప్రాజెక్ట్ కట్టుకున్నా మనకి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. ఎలాంటి పర్మిషన్ లేకుండా ప్రాజెక్ట్ కడుతామంటే ఎలా? అని ప్రశ్నించారు. పోస్ట్ కార్డు, ఆన్‌లైన్ పిటిషన్ ద్వారా మన డిమాండ్ తెలియ చేద్దామని అన్నారు. అన్ని ప్రభుత్వాలు ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నాయని.. తాము కూడా ట్యాపింగ్ చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి ఒప్పుకున్నారని గుర్తుచేశారు. అధికారులు ట్యాపింగ్ చేస్తే చేయొచ్చని రేవంత్‌రెడ్డి అన్నారని చెప్పారు. రేవంత్ ప్రభుత్వంలో ట్యాపింగ్ చేస్తే అధికారుల తప్పా? అని నిలదీశారు. కేసీఆర్ ప్రభుత్వంలో ట్యాపింగ్ చేస్తే కేసీఆర్, కేటీ–ఆర్‌లది తప్పా? అని ప్రశ్నించారు. కేసీఆర్ నాట్ల సమయంలో రైతుబంధు ఇస్తే... రేవంత్‌రెడ్డి ఓట్లప్పుడు ఇస్తున్నారని విమర్శించారు. మనకి సోషల్ మీడియా సపోర్ట్ తప్పా.. ఏ మీడియా సపోర్ట్ లేదని చెప్పుకొచ్చారు. సోషల్ మీడియాలో మన తడాఖా చూపెట్టాలని మాజీ మంత్రి కేటీ–ఆర్ సూచించారు.అలాగే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై పోలీసుల తీరుపై వర్కింగ్ కేటీఆర్ మండిపడ్డారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని పోలీసులను ఉద్దేశించి అన్నారు. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక మిత్తితో సహా జవాబు చెబతామని హెచ్చరించారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ అరెస్టయి పోలీస్ స్టేషన్‌లో ఉంటే ఆయనింటికి పోలీసులు వెళ్లారని కేటీఆర్ తెలిపారు. గెల్లు భార్య ఫోన్ ఇవ్వనని చెప్పినందుకు ఆమెపై అటెంప్ట్ మర్డర్ కేసు పెట్టారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ చెప్పే మొహబ్బత్ కా దుఖాన్ ఇదేనా అని నిలదీశారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని.. రేవంత్ రెడ్డికి బానిసలా పనిచేస్తున్న అధికారులను హెచ్చరించారు. మళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనని.. మిత్తీతో సహా జవాబు చెబుతామని వార్నింగ్ ఇచ్చారు. మూసీలో లక్షన్నర కోట్ల కుంభకోణం బయటపెడితే సీఎం రేవంత్ రెడ్డి లాగు తడిసిందని అన్నారు. మనం పోరాటం చేస్తేనే మూసీ కుట్రలు ఆగాయని చెప్పారు. లగచర్లలో రేవంత్ రెడ్డి అల్లుడి కంపెనీ కోసం గిరిజనుల భూములు లాక్కోవడానికి కుట్రలు పన్నారని విమర్శించారు. లగచర్ల ఆడబిడ్డలకు బీఆర్ఎస్ అండగా నిలిచిందని తెలిపారు. కంచ గచ్చిబౌలి భూములపై పోరాటం చేసింది విద్యార్థులేనని అన్నారు. మీ పోరాటాలకు మన లీగల్ సెల్ అండగా నిలిచిందని తెలిపారు. పోరాడిన వారికే రాజకీయంగా అవకాశాలు వస్తాయని స్పష్టం చేశారు. లీగల్ సెల్ ద్వారా జిల్లాల వారీగా విద్యార్థులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు.

## మావోయిస్టులకు ఎదురుదెబ్బ..

(మొదటి తరువాయి)

జరుగుతున్నాయని పేర్కొన్నారు.ఇన్సాస్, ఎస్ఎల్ఆర్ రైఫిల్స్ సహా భారీ మొత్తంలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని ఆయన వివరించారు. ప్రస్తుతం ఇంకా ఆపరేషన్ కొనసాగుతుందన్నారు. తాజాగా ఎన్‌కౌంటర్‌లో ఛత్తీస్‌గఢ్‌లో ఈ ఏడాది 225 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఇందులో 208 మంది బీజాపూర్, బస్తర్, కాంకేర్, కొండగావ్, నారాయణపూర్, సుక్మా, దంతేవాడ జిల్లాల్లోని బస్తర్ డివిజన్‌లో ప్రాణాలు కోల్పోయారు. ఇదిలా ఉండగా వచ్చే ఏడాది మార్చ్ నాటికి మావోయిస్టులను నిర్మూలించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు.

## ఆందోళనకరంగా ఏపీ ఆర్థిక పరిస్థితి

(మొదటి తరువాయి)

అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. ఇక, దీనికి తోడు రాష్ట్రంలో అవినీతి విపరీతంగా పెరిగిపోయింది అని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్. ఖజానాకు రావాల్సిన ఆదాయం రాకుండా పోతోంది.. పన్ను ఆదాయం, పన్నేతర ఆదాయాలు పేలవంగా ఉన్నాయి.. కొన్ని శాఖల్లోనైతే అత్యంత అధ్వాన్నమైన వృద్ధిరేటు– కనిపించింది.. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి మూడు నెలల్లో ఏ÷ ఆదాయాలు, అమ్మకపు పన్ను ఆదాయాలు గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే తక్కువగా ఉన్నాయి.. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో రాష్ట్ర సొంత ఆదాయాలు కేవలం 3.47 శాతం మాత్రమే పెరిగాయి.. కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే ఆదాయాలతో సహా మొత్తం ఆదాయాలు 6.14శాతం మాత్రమే పెరిగింది.. అప్పులు మాత్రం ఈ ఆర్థిక సంవత్సరం మొదటి మూడు నెలల్లో ఏకంగా 15.61శాం వేగంతో పెరిగాయని వైఎస్ జగన్ తెలిపారు.

## పోలీసులపై కేసుల విచారణలో జాప్యం ఎందుకు.... ఎంతైనా మనోళ్లేననా..?

(మొదటి తరువాయి)

ఫిర్యాదులు చేయడంతో కొన్ని మాత్రమే బయటకు వస్తున్నాయి. ఇంకా ఇలా పరువు పోతుందని ఫిర్యాదులు చేయకుండా ఉన్నవాళ్లు ఎంతో మంది ఉన్నారు. ఇలాంటి పోలీస్ అధికారులపై విచారణ చేయడంలో జాప్యం జరుగుతుందని తెలుస్తోంది. చొప్పదండికి చెందిన ఓ వ్యక్తి మహిళా సీఐ వల్లనే తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని వీడియో కాల్ చేసి చనిపోయారు. దీంతో ఈనెల 13న ఆ సీఐపై ఆత్మహత్యకు ప్రేరేపించడంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. సీఐ పాత్రపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఎఫ్ఐఆర్‌లో ఏ7గా సీఐ పేరును నమోదు చేసినట్లు పేర్కొంది. సీఐపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు. వారి తరఫున నవజీవన్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. అయినా ఇప్పటి వరకు ఈ కేసు విచారణలో, బాధ్యులపై ఎలాంటి చర్యల కానీ, ఎలాంటి కదలిక లేదు. కరీంనగర్ జిల్లాలో ఓ సీఐతో ఓ వ్యక్తి మాట్లాడిన ఆడియో సంభాషణ ఆరు నెలల కిందట సోషల్ మీడియాలో వైరగా మారింది. ఆ సీఐకి రూ.3 లక్షలు ఇచ్చినా కేసు ఎలా నమోదైంది. ఆ ఆడియోలో బాధితుడు సీఐతో వాగ్వాదానికి దిగిన మాటలో



దానిలో వినిపించాయి. దీని కారణంగా పోలీసు ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఆ శాఖలో ఒకట్రెండు రోజుల్లో చర్యలు తప్పవని చర్చ జరిగింది. కానీ జరిగిన ఆ విచారణ కూడా మొక్కుబడిగానే జరిగిందన్న అభిప్రాయం వ్యక్తమైంది. సస్పెన్షన్ వేటు పక్కనపెడితే కనీసం బదిలీ కూడా చేయలేదు. గతేడాది గొర్రెలను దొంగతనంగా అమ్ముకున్నాడని ఓ వ్యక్తిని పోలీస్ స్టేషన్లో చితక బాదారని ఎస్సైపై ఆరోపణలొచ్చాయి. ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించినా ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. గత వేవిలో ఓ శిక్షణ ఎస్సై ఓ వ్యక్తిని కొట్టాడనే విషయంలోనూ మొదట్లో విచారణ జాప్యం అయ్యింది. బాధితుడు జాతీయ కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో బాధ్యులపై తాత్కాలిక చర్యలు చేపట్టినా ఇప్పటికీ విచారణ పూర్తి స్థాయిలో జరగలేదు. పోలీసు శాఖకు మచ్చతెచ్చే విధంగా కొందరు వ్యవహరిస్తున్న తీరుపై అనుకున్న స్థాయిలో చర్యలు ఉండటం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో ఫ్రెండ్లీ పోలీసులుగా ఉంటామనే మాటలు అటకెక్కుతున్నాయి. ఎంతో ఆశతో కొందరు అధికారులు వారిని ఆశ్రయిస్తూ పోలీస్ స్టేషన్ మెట్లేక్కే వారి విషయంలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దూకుడుగా వ్యవహరిస్తున్న వారు శాఖకు తలవంపులు తెస్తున్నారు. ఇలాంటి సందర్భాల్లో ఉన్నతాధికారులకు కూడా ఇలాంటి సంఘటనలు ద్వారా తలనొప్పిగానే మారుతున్నాయి. వారు పైకి చర్యలు తీసుకుంటామంటున్నా శాఖకు అప్రతిష్ట అనే ఆలోచనతో లోలోపల మాత్రం అన్ని తప్పిదాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా వాస్తవాలను పక్కాగా నిర్ధారించుకుని క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

### అత్యంత విశ్వసనీయ
# నేతగా మోడీ

(మొదటి తరువాయి)

నిర్వహించారు. ఈ సర్వేలో ప్రధాని నెం.1గా నిలవడంపై బీజేపీ సీనియర్ నేత అమిత్ మాల్వీయ సోషల్ మీడియా వేదికగా హర్షం వ్యక్తం చేశారు. భారతీయులతో పాటు– ప్రపంచవ్యాప్తంగా మిలియన్‌ల మంది ప్రజల గౌరవాభిమానాలు చూరగొన్న నేతగా ప్రధాని నిలిచారని అన్నారు. అత్యధిక అనుకూల రేటింగ్స్ కలిగిన నేతగా ఉన్నారంటూ ప్రశంసల్లో ముంచెత్తారు. బలమైన నాయకత్వం, ప్రపంచవ్యాప్తంగా గౌరవాభిమానాలు పొందే నేత సారథ్యంలో భారత్ భద్రంగా ఉందని కామెంట్ చేశారు. మార్నింగ్ కన్సల్ట్ నిర్వహిస్తున్న సర్వేల్లో మోదీ 2021 నుంచి ప్రథమ స్థానంలోనే కొనసాగుతున్నారు. సర్వేల్లో ప్రధానికి మద్దతుగా నిలుస్తున్న వారి సంఖ్య 70 శాతానికి పైగానే ఉంటోంది. 2022 సర్వేలో కూడా 13 ప్రపంచం నేతల్లో జనాదరణ పరంగా ప్రధాని టాప్‌లో నిలిచారు. ఇక 2023 నాటి సర్వేలో ఆయన అప్రూవల్ రేటింగ్స్ 76 శాతానికి ఎగబాకాయి. గతేడాది ఫిబ్రవరిలో జరిగిన సర్వేలో విశ్వసనీయత రేటింగ్స్ గరిష్ఠంగా 78 శాతాన్ని తాకాయి. ఇక తాజా సర్వేలో ప్రధాని తర్వాతి స్థానంలో దక్షిణ కొరియా నేత లీ జే మ్యూంగ్ ఉన్నారు. 59 శాతం అప్రూవల్ రేటింగ్స్‌తో రెండో స్థానంలో నిలిచారు. ఆ తరువాతి స్థానాల్లో అర్జెరటీ–నా నేత జేవియర్ మైలీ (57 శాతం), కెనడా అధినేత మార్క్ కార్నీ (56 శాతం) ఉన్నారు. ఇక ఈ జాబితాలో 44 శాతం అప్రూవల్ రేటింగ్స్‌తో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎనిమిదో స్థానంలో నిలిచారు.

# స్వచ్ఛమైన గాలి పీల్చిన ఢిల్లీ..

(మొదటి తరువాయి)

ఢిల్లీ ఎప్పుడూ సతమతం అవుతుంది. ప్రస్తుతం అక్కడ అనుకూల వాతావరణ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇటీవల ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పాటు గాలి కదలికల్లోనూ మార్పు వచ్చింది. దీని వల్ల ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛమైన గాలులు వీస్తున్నాయి. అయితే జూలై 25వ తేదీన మళ్లీ ఎయిర్ క్వాలిటీ మాడరేట్ స్థాయిలో చూపించింది. కానీ రెండుమూడు రోజుల పాటు ఆకాశంలో కాలుష్యం తగ్గడం శుభపరిణామంగా భావిస్తున్నారు. క్లీన్ ఎయిర్‌ను పాజిటివ్ సంకేతంగా చూస్తున్నారు. పర్యావరణ, రెగ్యులేటరీ పరిణామాలు.. అర్బన్ ఎయిర్ క్వాలిటీని పెంచినట్లు అధికారులు చెబుతున్నారు.సీపీసీబీ డేటా ప్రకారం ఢిల్లీలో జూలై 23వ తేదీన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 67గా ఉంది. జూలైలో ఇదే క్లీనెస్ట్ డేగా రికార్డు అయ్యింది. 51 నుంచి 100 మధ్యలో ఏక్యూఐ లెవల్స్ ఉంటే దీన్ని సంతృప్తికరంగా పేర్కొంటున్నారు. దీని వల్ల వాయు సంబంధిత రుగ్మతలు ఉండవని, సాధారణ ప్రజల ఆరోగ్య పరిస్థితి బాగుంటుందని భావిస్తారు. జూలై 22వ తేదీన ఢిల్లీలో వాయు నాణ్యత 103గా ఉంది. ఇది మోడరేట్ క్యాటగిరీలోకి వస్తుంది. జూలై 24వ తేదీన ఏక్యూఐ .. సంతృప్తికరంగా ఉంది. ఆ రోజు మొత్తం సాటిస్‌ఫాక్టరీ రేంజ్‌లో ఉంది. ఉదయం 9 నుంచి రాత్రి ఏడు వరకు ఏక్యూఐ 76 నుంచి 92 మధ్య ఉంది. ఇక జూలై 25వ తేదీన ఏక్యూఏ.. 128 నుంచి 136 మధ్య రికార్డు అయింది. దీన్ని మాడరేట్ కేటగిరీగా భావిస్తారు

### కాంగ్రెస్ బీసీ పాలిటిక్స్
# పేరుతో మోసం

(మొదటి తరువాయి)

ఉంటానని అన్నారు. పాలమూరు నుంచి ఇంకా వలసలు తగ్గలేదని.. పాలమూరు జిల్లా బిడ్డగా సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని పట్టించుకోవాలని కోరారు. కాంగ్రెస్ కులగుణన ఒక బూటకమని.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పడం ప్రజలన మోసం చేయడమేనని విమర్శించారు. మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమని తేల్చి చెప్పారు. బిసిల పేరు చెప్పి ముస్లింలకు రిజర్వేషన్లు ఎలా ఇస్తారని అన్నారు. దీనికి బిజెపి వ్యతిరేకమని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి తిరగటమే సరిపోయిందని.. రాష్ట్రంలో పరిపాలనా ఆటకెక్కిందని దుయ్యబట్టారు. పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలన్న చిత్తశుద్ధి రేవంత్ రెడ్డికి లేనే లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. పాలమూరు జిల్లా భవిష్యత్‌లో బీజేపీ అడ్డాగా మారుతోందని ధీమా వ్యక్తం చేశారు.

# గోవా గవర్నర్‌గా అశోక్‌గజపతి ప్రమాణం

(మొదటి తరువాయి)




ప్రమాణ స్వీకారం నేపథ్యంలో అశోక్ గజపతి రాజు తన కుటుంబ సభ్యులతో కలసి శుక్రవారం ఉదయమే గోవాకు చేరుకున్నారు. ఆయన వెంట కుమార్తె స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి, భార్య సునీలాగజపతి, ఇతర కుటుంబ సభ్యులు వెళ్లారు. అశోక్ గజపతిరాజు ప్రమాణ స్వీకారానికి జిల్లాలో ఉన్న అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు వందల సంఖ్యలో గోవాకు తరలి వెళ్లారు. గోవా గవర్నర్‌గా పూసపాటి అశోక్ గజపతిరాజు ప్రమాణ స్వీకారంలో పాల్గొనేందుఉ టిడిపి శ్రేణులు కూడా హాజరయ్యారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, మంత్రివర్గ సభ్యులు, ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఏపీ మంత్రులు నారా లోకేశ్, సంధ్యారాణి, తెలుగుదేశం ఎంపీలు, ఏపీ బీజేపీ అధ్యక్షుడు, నేతలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రమాణస్వీకారం అనంతరం అశోక్ గజపతిరాజును గోవా అధికారులు పరిచయం చేసుకున్నారు. ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ స్వయంగా పరిచయం చేశారు. అనంతరం మంత్రి నారా లోకేష్.. గజపతిరాజుకు బొకే ఇచ్చి.. శాలువా కప్పి సన్మానించారు.

**2025 జూలై 27, ఆదివారం తెలుగు పంచాంగం (హైదరాబాదు)**




**మాసం - పక్షం**
మాసం: శ్రావణమాసం (అమాంత)
పక్షం: శుక్లపక్షం

**తిథి**
శుక్లపక్షం త్రియది: జూలై 26, రాత్రి 10:42 నుండి జూలై 27, రాత్రి 10:42 వరకు
చవితి: జూలై 27, రాత్రి 10:42 నుండి జూలై 28, రాత్రి 11:24 వరకు

**నక్షత్రం**
మఘ: జూలై 26 సా.3:52 నుండి జూలై 27 సాయంత్రం 4:23 వరకు
పూర్వఫాల్గుణి: జూలై 27 సా.4:23 నుండి జూలై 28 సాయంత్రం 5:35 వరకు

**సూర్యోదయం - సూర్యాస్తమయం**
సూర్యోదయం: ఉదయం 5:58
సూర్యాస్తమయం: సాయంత్రం 6:47

**చంద్రోదయం -చంద్రాస్తమయం**
చంద్రోదయం: ఉదయం 8:03
చంద్రాస్తమయం: సాయంత్రం 8:51

**శుభ సమయాలు**
అభిజిత్ ముహూర్తం: ఉదయం 11:56 - మధ్యాహ్నం 12:48
అమృతకాలం: మధ్యాహ్నం 1:56 - 3:34
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:22 - 5:10

**అశుభ సమయాలు**
రాహుకాలం: సాయంత్రం 5:11 -6:47
యమగండం: మధ్యాహ్నం 12:22 - 1:58
దుర్ముహూర్తం: 5:04-5:55 సాయంత్రం
వర్జ్యం: రాత్రి మధ్యాహ్నం 12:47 - 2:28

# అమ్మ పల్లె అమ్మ చెరువు మరమ్మత్తుపై
# రైతుల ఆశ ఈ ఏడాదైనా తీరేనా?







- అమ్మ చెరువు రైతులకు నిరుపయోగమే!
- 9 ఏళ్లుగా నీటికి నోచని రైతాంగం
- అధికారుల నిర్లక్ష్యంపై రైతుల ఆవేదన

**వనపర్తి,జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దమందడి మండలం అమ్మపల్లె గ్రామంలోని అమ్మ చెరువు పూర్వము రైతులకు బాగా ఉపయోగపడేది కానీ నేడు ఆ చెరువు మరమ్మత్తుకై గ్రామ రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు,గత తొమ్మిదేళ్లుగా పూర్తిగా ఉపయోగాన్ని కోల్పోయింది. అధికారుల నిర్లక్ష్యంతో చెరువు నుంచి సాగునీరు అందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

వ్యవసాయానికి ఉపయోగపడే తూము 9 ఏళ్ల నుంచి తెరవడానికి అనుకూలంగా లేదు, దాన్ని మరమ్మతు చేయడానికి అధికారులు ముందుకు రావడం లేదు, ఈ ఏడాది ఏకంగా తూము కింద రంధ్రం పడడంతో చెరువులోకి వచ్చే నీరు వృథాగా పోతోంది. ఈ సమస్యను పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా, ఇప్పటికీ ఎటువంటి మరమ్మతులు చేపట్టలేదు. దీనివల్ల చెరువు రైతులకు కాదు, వృథా కాల్వకే పనికొస్తున్నట్టు పరిస్థితి ఏర్పడింది. గ్రామస్థులు,రైతులు చెరువుని పునరుద్ధరించాలని పదే పదే విజ్ఞప్తులు చేసినా, అధికారుల నుంచి స్పందన లేకపోవడంపై వేధనకు గురవుతున్నారు. వర్షాకాలం వచ్చినా, చెరువులో నీరు నిలవకపోవడం బాధాకరమని వారు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత శాఖలు స్పందించి చెరువు తూము మరమ్మతులు చేపట్టి, రైతులకు నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# షాద్ నగర్ చౌరస్తాపై ఘోర రోడ్డు ప్రమాదం

## ట్యాంకర్ ఢీకొని తండ్రి, కూతుళ్ళ దుర్మరణం



**షాద్ నగర్, జూలై 26(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ చౌరస్తాలో శనివారం ఉదయమే ఘోర రోడ్డు ప్రమాదం జరిగి తండ్రి కూతుళ్లు ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. షాద్ నగర్ చౌరస్తాలో ఓ ట్యాంకర్ లారీ నిర్లక్ష్యంగా బైక్ ఇస్తున్న ఢీకొట్టడంతో పట్టణానికి చెందిన మచ్చేందర్ అతని కూతురు మైత్రి దుర్మరణం పాలయ్యారు. రోడ్డు ప్రమాదం జరగగానే మైత్రి తన ఫోన్ ను అక్కడే ఉంటున్న తయబ్ అనే వ్యక్తికి ఇచ్చి తన వాళ్లకు ఫోన్ చేయాలని ప్రాధేయపడడం అక్కడ కన్నీరు పెట్టించింది. మైత్రికి వస్తున్న తన స్నేహితురాల ఫోన్లో ఇతరుల ఫోన్లకు తయ్యబ్ సమాచారం తెలియజేశారు. లారీ డ్రైవర్ ప్రస్తుతం షాద్ నగర్ పోలీసుల అదుపులో ఉన్నారు. ఈ విషయమై పట్టణ సీఐ విజయ్ కుమార్ ను వివరణ కోరగా తండ్రి కూతుర్లు ఇద్దరు చనిపోయారని సిఐ తెలిపారు. డ్రైవర్ పోలీసుల అదుపులో ఉన్నట్టు తెలిపారు. అదేవిధంగా మచ్చేందర్ తన కూతురు మైత్రిని శంషాబాద్ వర్ధమాన్ కాలేజీకి పంపించేందుకు బస్ స్టేషన్ వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుందని సిఐ తెలిపారు. శవాలను ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు..

# బిజెపిలో గ్రూపుల్లేవ్.. పార్టీ బలోపేతమే లక్ష్యం!

- షాద్ నగర్‌లో రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు స్పష్టీకరణ




**షాద్ నగర్, జూలై 26(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** "బిజెపిలో గ్రూపులు లేవు.. రాజకీయాలు ఉండవు.. సమయం వచ్చినప్పుడు అందరూ కలిసి పని చేస్తారు" అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్ర రావు స్పష్టం చేశారు. తిమ్మాపూర్ వద్ద పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.ప్రస్తుతం పార్టీ బలోపేతం పైనే దృష్టి సారించామని, పాలమూరు ఎంపీ డీకే అరుణతో కలిసి జిల్లాలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. మేధావులు, నేతలు, కార్యకర్తలతో సమావేశమవుతూ పార్టీ వ్యూహాలను చర్చిస్తున్నామని వివరించారు. తదుపరి ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో పర్యటనలు కొనసాగనున్నాయని చెప్పారు. మహబూబ్ నగర్, నారాయణపేట, గద్వాల, వనపర్తి, నాగర్ కర్నూల్, అచ్చంపేట ప్రాంతాల్లో కూడా పర్యటించనున్నట్లు వెల్లడించారు. షాద్ నగర్ నియోజకవర్గంలో వేర్వేరు గ్రూపులుగా మారుతున్న నాయకులపై మీడియా ప్రశ్నకు స్పందిస్తూ, "ఇక్కడ గ్రూపులు లేవు.. టైం వచ్చినప్పుడు అందరూ కలిసి పని చేస్తారు" అని స్పష్టం చేశారు.ఈ పర్యటనలో ఎంపీ డీకే అరుణ, రాజభూపాల్ గౌడ్, నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అందె బాబయ్య, చెంది మహేందర్ రెడ్డి, వెంకటేష్ గుప్తా, దేపల్లి అశోక్ గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ వదంతులు నమ్మవద్దు

## కప్పాటి పాండురంగా రెడ్డి



**మహేశ్వరం, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ యూరియా కొరతపై చేస్తున్న ప్రచారం వదంతులేనని, రైతులు వాటిని నమ్మవద్దని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కప్పాటి పాండురంగా రెడ్డి స్పష్టం చేశారు.ప్రజా ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసాన్ని జీర్ణించుకోలేని ప్రతిపక్ష నాయకులు రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. యూరియా సరఫరా కేంద్రంతో సంప్రదింపులు జరుపుతూ, అవసరమైనంత మేరకు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు."రైతులకు కావలసిన యూరియా సరిపడా ఉంది. పట్టా పాస్‌పుస్తకం, ఆధార్‌తో వెళ్లి తీసుకోవచ్చు. కొరత లేదని స్పష్టంగా చెబుతున్నా," అని పాండురంగా రెడ్డి పేర్కొన్నారు.సోషల్ మీడియా, కొన్ని ప్రచార మాధ్యమాల్లో రైతులు గంటల కొద్దీ లైన్లలో నిలబడుతున్నారన్న వార్తలు అసత్యమని, అవి ప్రజలను భయపెట్టేలా చేస్తున్నాయని ఆయన విమర్శించారు. ప్రతిపక్షాలకు తెలిసింది గోరంతా, తెలియంది కొండంతలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు చర్చిస్తూ రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

## క్రెడాయి జాతీయ అధ్యక్షుడు

# గుమ్మ రామ్ రెడ్డికి ఘన సన్మానం




**వరంగల్, జూలై 26(నీలగిరి ఎక్స్ ప్రెస్):** క్రెడాయి వరంగల్ కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన గుమ్మ రామ్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. అధ్యక్షుడు నాయిని అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ, "2008లో సాధారణ సభ్యుడిగా ప్రారంభించి, నేడు జాతీయ స్థాయికి ఎదగడం తెలంగాణ బిల్డర్స్‌కు గర్వకారణం" అన్నారు.రామ్ రెడ్డి మాట్లాడుతూ, "లాభాలకే పరిమితం కాకుండా, న్యాయమైన ఇల్లు నిర్మించడం నిజమైన ఆనందం" అని తెలిపారు. వరంగల్‌తో తన అనుబంధాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్ సాగర్ రెడ్డి, ఐఏఎస్ అధికారి శాఖమూరి శ్రీ సాయి ఆశ్రిత్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# తండ్రి కూతుర్ల మరణం అత్యంత విచారకరం- నీల రవీందర్



**షాద్ నగర్, జూలై 26(నీలగిరి ఎక్స్ ప్రెస్)** బస్సు స్టేషన్‌కు బైక్‌పై వెళ్లిన మచ్చేందర్ (48), కుమార్తె మైత్రి (19) పై ట్యాంకర్ లారీ వెళుతుండగా ఢీకొని ప్రాణాలు హరించింది. మచ్చేందర్ రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త కాగా, మైత్రి వర్ధమాన్ కళాశాలలో బీటెక్ చదువుతోంది. ఈ సంఘటనపై సామాజిక కార్యకర్త నీల రవీందర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "వారి మరణం హృదయాన్ని కలిచివేస్తోంది" అని చెప్పారు.

# ఘనంగా సిఎల్ శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలు



**ఆమనగల్లు, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, తలకొండపల్లి మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలు ఆమనగల్లు పట్టణంలోని శ్రీశైలం జాతీయ రహదారిపై ఘనంగా నిర్వహించారు. పార్టీ యూత్ అధ్యక్షుడు దేరంగుల వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు గిరిజన రాష్ట్ర నాయకుడు, మున్సిపాలిటీ అధ్యక్షుడు డా. పత్య నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అభిమానులు, కార్యకర్తల మధ్య శ్రీనివాస్ యాదవ్ కేక్ కట్ చేసి, అనంతరం శుభాకాంక్షలు అందుకున్నారు. పెద్ద సంఖ్యలో అభిమానులు పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి తరలివచ్చిన పార్టీ శ్రేణులు బాణాసంచా పేల్చుతూ వేడుకలను మరింత ఉత్సాహంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్ గౌడ్, మాజీ కౌన్సిలర్ వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ పంతు నాయక్, మాజీ సర్పంచ్ శ్రీను నాయక్, మైనార్టీ నాయకులు ఖలీల్, గుత్తి బాలస్వామి, మున్సిపాలిటీ కార్యదర్శి శివకుమార్, వరికుప్పల గణేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు లండం యాదయ్య, మహేష్ నేత, నాగిళ్ళ జగన్, గండికోట శంకర్, పరమేష్, శెట్టిపల్లి వెంకటయ్య, భీమయ్య, ఎనమళ్ళ రమేష్, ఏడెల్లి రమేష్, లండం గిరి, గణేష్ నాయక్, బయ్య దేవేందర్, దేరంగుల రాము తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలలో బిజెపి జెండా ఎగరాలి




❍రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల ప్రభారీ పాపా రావు

**యాచారం,జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
యాచారం మండలం కేంద్రం లో బిజెపి మండల అధ్యక్షులు జరుపుల విజయ్ నాయక్ ఆధ్వర్యంలో కార్గిల్ దివాస్ సందర్భంగా సైనికులకు ఘనంగా నివ్వాలర్పించారు. యాచారం స్థానిక ఎన్నికల కార్యశాల జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న పాపా రావు మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్ ను కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మలేక పోతున్నారని ఇచ్చిన హామీలు నిలబెట్టకొక రోజుకొక మాట చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారని బీఆర్ఎస్ ఆచూకీ లేకుండా పోయింది రాబోయే స్థానిక ఎన్నికలలో



ప్రధాని నరేంద్ర మోదీ అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమలు ప్రజలలోకి తీసుకెళ్లి యాచారం మండలం లో జడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్ లు వార్డు సభ్యులు ఎక్కవ స్థానాలు గెలవాలని అన్నారు. మరియు రంగారెడ్డి జిల్లా ఎన్నికల కన్వీనర్ అందెల శ్రీరాములు యాదవ్,బిజెపి సీనియర్ నాయకులు క్రమశిక్షణ కమిటీ సభ్యులు యాచారం మండలం ఎన్నికల ప్రభారీ బోసుపల్లి ప్రతాప్ గారు, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మఠ్రిపల్లి అంజయ్య యాదవ్ , ఎన్నికల మండల కన్వీనర్ మేకల యాదగిరి రెడ్డి మాట్లాడుతూ అందరం సమిష్టిగా కష్టపడి ఇల్లు ఇల్లు తిరిగి ప్రచారం చేసి ఎక్కువ ఎంపీటీసీ, సర్పంచ్ లు గెలవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో స్టేట్ కౌన్సిల్ మెంబెర్ శ్రీధర్ రెడ్డి, నాగిని యాదయ్య , గొల్లపల్లి జంగయ్య గౌడ్, గోగికర్ రమేష్ , పగడాల శ్రీశైలం, మాజి మండల అధ్యక్షులు తాంద్ర రవీందర్, పీఏసీఎస్ డైరెక్టర్ కొండా మధుకర్ రెడ్డి, మాజి సర్పంచ్ లు ఆంబోజి జగదీష్ యాదవ్, రాయకంటి విజయ్ కుమార్ తో పాటు నాయకులు కార్యకర్తలు బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

# కూకట్పల్లి అభివృద్ధిపై కాంగ్రెస్ నేత బండి రమేష్ ఘాటు విమర్శలు

**మూసాపేట, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కూకట్పల్లి నియోజకవర్గ అభివృద్ధిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కృష్ణారావు చేస్తున్న వ్యాఖ్యలు హాస్యాస్పదమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ మండిపడ్డారు. శనివారం హేమ దుర్గాభవాని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు"ఎన్నికల ముందు 90 శాతం అభివృద్ధి చేశానంటూ చెప్పిన ఎమ్మెల్యే, ఇప్పుడు పనులే కావటం లేదంటూ డ్రామాలు చేస్తున్నారు. ప్రజలకు రోజుకు రెండు గంటలకే అందుబాటులో ఉంటారు," అని రమేష్ విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు తనతో పాటు పార్టీ నేతల ఫోన్లు ట్యాప్ చేయడం, అధికారులను బెదిరించడం, ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం వంటి చర్యలు తీసుకున్నారని



ఆరోపించారు. హౌసింగ్ బోర్డు భూముల పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, టీఆర్ఎస్ హయాంలో చెరువులు, కుంటలు ఆక్రమించి అమ్ముకున్నారని మండిపడ్డారు. "కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలలోనే నియోజకవర్గ అభివృద్ధికి రూ.10 కోట్లు మంజూరు చేసింది. మహిళలకు ఉచిత బస్సు, రూ.500 గ్యాస్, ఉచిత కరెంటు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలు అమలవుతున్నాయి," అని వివరించారు.రైతుల సంక్షేమం కోసం రూ.23 వేల కోట్ల రుణమాఫీ, రూ.9,000 కోట్ల భరోసా సహాయం అందించామని తెలిపారు. కూకట్పల్లి నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి, పీజీ కాలేజీ, 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కృష్ణారావు సాంకేతికంగా గెలిచినా, నైతికంగా ఓడిపోయారు. ఆయన అనుచరులు ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి డబ్బులు వసూలు చేశారు," అని రమేష్ ధ్వజమెత్తారు.ఈ సమావేశంలో ఏ, బి బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, తూము వేణు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంలో స్వతంత్ర స్వరం అవసరమే




దేశంలో ప్రజాస్వామ్యం ఒక గొప్ప పదం. కానీ ఆ పదం నిజంగా జీవించాలంటే, అది కొన్ని పార్టీల చేతిలో ఓటమి చెందకూడదు. దురదృష్టవశాత్తూ ఈరోజుల్లో రాజకీయ పార్టీలు వ్యక్తిగత ప్రయోజనాల కోసమే పనిచేస్తున్న వైనం కనిపిస్తోంది. ప్రజలకు వాగ్దానాలు ఇవ్వడం, ఎన్నికల సమయంలో సేవగా కనిపించడం, గెలిచాక మరిచిపోవడం -ఇవే పార్టీల ధోరణులుగా మారిపోయాయి.ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలంటే పార్టీలు మాత్రమే కాదు, స్వతంత్ర అభ్యర్థులు కూడా ముందుకు రావాల్సిన అవసరం ఉంది. సమాజాన్ని పునర్నిర్మించాలన్న తపన ఉన్న వ్యక్తులు ు సత్యనిష్ఠ గల విద్యావేత్తలు, యువ నాయకులు, సామాజిక సేవకులు ు రాజకీయాల్లోకి రావాలి. కానీ విచారకరం ఏమంటే, అలాంటి మంచి వ్యక్తులను ప్రజలు గుర్తించడంలో వెనుకబడుతున్నారు. పార్టీ గుర్తుల మోజు ప్రజలను కళ్ళు మూసేసేలా చేస్తోంది.మరోవైపు, విద్యావేత్తలు -మన మేధస్సు ప్రాతినిధ్యం వహించే వారు - స్వతంత్ర అభ్యర్థులను ప్రజల్లోకి తీసుకురావడంలో విఫలమవుతున్నారు. కొంతమంది డబ్బు ఆశతో, ప్యాకేజీల వాసనతో తమ స్వరాన్ని కోల్పోతున్నారు. ఇది మరింత ప్రమాదకరం. ప్రజలకు మార్గనిర్దేశం చేయాల్సిన వారే మౌనంగా ఉన్నప్పుడు, వాస్తవ మార్పు ఎలా సాధ్యం అవుతుంది? ప్రజలు తమ ఓటును కేవలం పార్టీ గుర్తుపై కాకుండా, అభ్యర్థి వ్యక్తిత్వాన్ని, అర్థబుద్ధిని, నైతికతను విశ్లేషించి వేయాలి. ఇదే ప్రజాస్వామ్య బలం. స్వతంత్ర అభ్యర్థుల విజయమే నిజమైన ప్రజల గెలుపు. వారు గెలిస్తే, వారు సేవ చేస్తే - అది పార్టీ క్రమశిక్షణకు కాదు, ప్రజల అభ్యున్నతికి నిలిచే సేవ.ప్రజాస్వామ్యాన్ని బలపర్చే దిశగా, ప్రజలు చైతన్యవంతులై మంచి స్వతంత్ర వ్యక్తులను గుర్తించాలి. మేధావులు, విద్యావేత్తలు తమ బాధ్యతను గుర్తించి వారి వెంటే నిలవాలి. లేకపోతే, నలుగురి మేలు కోసం అంకితమై నిలబడే స్వతంత్ర స్వరాలు, పార్టీల గోలలో మిగిలిపోతాయి.

**వ్యాస కర్త**
గంగవరం రామకృష్ణారెడ్డి
(సామాజిక పరిశీలకుడు - వనపర్తి)



## కోళ్ల పడకల్ గ్రామంలో మైసమ్మ, పోచమ్మ బోనాల మహోత్సవాలు
### -ఎలుకటి రఘుపతి



**మహేశ్వరం జులై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలానికి చెందిన కోళ్ల పడకల్ గ్రామంలో గ్రామ పెద్దలు నిర్ణయించిన తేదీల ప్రకారం ఆలయాలకు చెందిన మైసమ్మ ఈదమ్మ బోనాలు నేడే ఆదివారం,అలాగే పోచమ్మ బోనాలు రేపు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుగనున్నాయి.ఈ సందర్భంగా గ్రామంలోని భక్తులు,మహిళలు, యువకులు,గ్రామ పెద్దలు పెద్దఎత్తున పాల్గొని అమ్మవార్లకు బోనాలు సమర్పించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని గ్రామ శాఖ అధ్యక్షుడు ఎలుకటి రఘుపతి (బీఆర్ఎస్) తెలియజేశారు.గ్రామంలో భక్తి శ్రద్ధలతో పండుగ వాతావరణం నెలకొంది.

## జేడ్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం
### ముఖ్య అతిథిగా పాల్గొన్న కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇంచార్జి హన్మంత్ రెడ్డి



**కొంపల్లి, జూలై 26(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన జేడ్ స్పెషాలిటీ హాస్పిటల్ ను ఈరోజు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి గారు ఫితా కత్తిరించి ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన హాస్పిటల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలుపుతూ మాట్లాడారు."ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ విశ్వసనీయతను సంపాదించాలి. హాస్పిటల్ పేరు ప్రఖ్యాతులు పొందేలా సేవల ప్రమాణం నిలిపే ప్రయత్నం ఉండాలి," అని కోరారు హన్మంత్ రెడ్డి.

## "ది లీడర్" శిక్షణ తరగతుల్లో పాల్గొన్న దారమోని గణేష్ బృందం
❍తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నాయకత్వ లక్షణాలపై అవగాహన




**కల్వకుర్తి, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో హైదరాబాద్ కోపంపల్లి శ్రీ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన "ది లీడర్" నాయకత్వ శిక్షణ తరగతుల్లో నాగర్ కర్నూల్ జిల్లా జాగృతి అధ్యక్షుడు దారమోని గణేష్ బృందం పాల్గొంది.ఈ శిక్షణ తరగతులలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయనున్న సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ అభ్యర్థుల నాయకత్వాన్ని బలపరచడం, ప్రజలకు సేవలందించే విధానాలు, స్థానిక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించడం వంటి అంశాలపై మౌలికంగా శిక్షణ ఇవ్వబడింది.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు చిలుక మంజుల, సుశీల, ముబీన్, నరసింహ, కృష్ణ, శేఖర్ తదితరులు పాల్గొని నాయకత్వ లక్షణాలపై చర్చించారు. ప్రజాస్వామ్యాన్ని బలపరిచే దిశగా యువత, మహిళలు ముందుకు రావాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు.

## డీఎస్పీ జీదుల మహేశ్ కుటుంబానికి మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శ

**కరీంనగర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇటీవల గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందిన కరీంనగర్ పోలీస్ శిక్షణ కేంద్రం డీఎస్పీ జీదుల మహేశ్ కుటుంబాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. ఈ రోజు కరీంనగర్‌లోని వారి



నివాసానికి వెళ్లి మహేశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఆయన భార్య హుజూరాబాద్ ఏసీపీ మాధవిని, కుటుంబ సభ్యులను మంత్రి ఓదార్చారు. పోలీస్ శాఖలో విశేష సేవలందించిన మహేశ్ మృతి పట్ల మంత్రి తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. జీదుల మహేశ్ 1995 బ్యాచ్‌కు చెందినవారు. ఆయన భార్య మాధవితో కలిసి ఒకేసారి ఎస్ఐగా చేరి, పదోన్నతుల ద్వారా డీఎస్పీ, ఏసీపీ స్థాయికి ఎదిగారు. ఇద్దరు కుమారులు ఉన్న ఈ కుటుంబం ఇటీవల తీవ్ర విషాదంలో మునిగిపోయింది.

# పర్యావరణ పరిరక్షణ సమితి యొక్క లక్ష్యాలు మరియు మిషన్

- లక్ష్యం

సుస్థిరమైన, ఆరోగ్యకరమైన జీవనవాతావరణం కోసంపర్యావరణాన్ని రక్షిస్తూ, ప్రజల ఆరోగ్యం, ఆయుష్షు పెంపుకు కృషి చేయడం.

మిషన్

- శాస్త్రీయ పద్ధతుల్లో పర్యావరణ పరిరక్షణ
- గాలి, నీరు, నేలపై కాలుష్య నివారణ
- విద్య, సాంకేతికతతో ప్రజల్లో అవగాహన
- యువతకు పది వేల ఉద్యోగ అవకాశాలు
- అభివృద్ధి -పర్యావరణాన్ని సమతుల్యంగా ముందుకు నడిపించడం
- మాదకద్రవ్యాల రహిత భారత దేశ ఆవిష్కరణ
- భారతీయ సాంప్రదాయాల విస్తృత ప్రచారం

పర్యావరణ పరిరక్షణ సమితి
చెట్టు = అమ్మ
Reg No. 643/2025
Nurture Nature, Promote Wellness

# కార్గిల్ విజయ్ దివస్: ధైర్యానికి నాందిగీ-దేశ భక్తికి నిధి!




దేశ చరిత్రలో దెబ్బకి దెబ్బను తిప్పిన ధైర్యవంతుల పోరాటానికి గుర్తుగా నిలిచిన ఘట్టమే కార్గిల్ యుద్ధం. పరాక్రమం, వ్యూహాత్మక తెలివితేటలు, దౌత్య విజయం - ఈ మూడింటి సమన్వయంతో దేశం తలవంచకుండా నిలబెట్టిన సైనికుల త్యాగానికి గుర్తుగా ప్రతి సంవత్సరం జూలై 26వ తేదీని ‘కార్గిల్ విజయ్ దివస్’గా ఘనంగా నిర్వహిస్తున్నాం.

పాకిస్తాన్ చేసిన కుట్రకు భారత్ ఎలా బదులిచ్చిందో తెలుసుకోవడం నేటి యువతకు, రేపటి తరాలకు ఓ మోటివేషన్‌గా నిలవాలి.

### పాక్ కుట్ర -భారత్ ప్రతిఘాతం

1999లో పాకిస్తాన్ సైన్యం ముజాహిదీన్ వేషధారణలో కార్గిల్ సెక్టార్‌లోని వ్యూహాత్మక పర్వతాలను ఆక్రమించేందుకు కుట్ర పన్నింది. కానీ, స్థానిక గొర్రెల కాపరుల ద్వారా సమాచారం లభించడంతో ఇండియన్ ఆర్మీ అప్రమత్తమై ఆపరేషన్ విజయ్ చేపట్టింది.

ప్రారంభంలో తీవ్ర వాతావరణం, ఎత్తైన ప్రాంతాల్లో ఉండే పాక్ దళాలు భారత్‌కు ఓ అవాంతరంగా మారినా వ్యూహాలను మార్చుకుంటూ భారత్ నెగ్గింది.

### బోఫోర్స్ ధాటికి వణికిన శత్రువు

ఎత్తైన శిఖరాలపై నుంచి జరుగుతున్న దాడులను నిలువరించేందుకు భారత సైన్యం బోఫోర్స్ ఫిరంగులను రంగంలోకి దించింది. వీటి కచ్చితమైన దాడులతో శత్రువు శిబిరాలు నాశనం అయ్యాయి. పాకిస్తాన్ దళాలపై భారత బలగాల దెబ్బకు శత్రు బలహీనమయ్యాడు.

### ఆకాశం నుంచి మిరాజ్ దాడులు

స్థలదళాలకు తోడుగా ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఆపరేషన్ సఫేద్ సాగర్ ప్రారంభించింది. మిగ్-27, మిగ్-21 వంటి యుద్ధవిమానాలతో పాటు, మిరాజ్ 2000 లేజర్ గైడెడ్ బాంబులతో శత్రు స్థావరాలను ధ్వంసం చేసింది. అయితే ఈ పోరాటంలో విపరీతంగా కష్టాలు ఎదురయ్యాయి. మిగ్-27 యంత్ర వైఫల్యంతో పతనం కాగా, మిగ్-21 పైలట్ అజయ్ అహూజా అమరుడయ్యాడు.

### టోలోలింగ్ నుంచి టైగర్ హిల్ వరకు-శిఖరాల స్వాధీనం

భారీ పోరాటం తర్వాత టోలోలింగ్ శిఖరాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్న భారత్, టైగర్ హిల్, బాత్రా టాప్, పాయింట్ 5140లను కైవసం చేసుకుంది. ఈ పోరులో విక్రమ్ బాత్రా, మనోజ్ పాండే వంటి ధీరజవాన్లు అమరులయ్యారు. దేశానికి గౌరవం తీసుకువచ్చారు.

### దౌత్యపరంగా గట్టి పట్టుదల


వెదురుగా పాకిన పాక్ కుట్రలను అంతర్జాతీయ వేదికలపై భారత్ బట్టబయలు చేసింది. అప్పటి ప్రధాని నవాజ్ షరీఫ్పై అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ ఒత్తిడి తెచ్చి బలగాలను వెనక్కి తీయించాలని హెచ్చరించారు. ఒక్క వైపు సైనిక దెబ్బ, మరోవైపు దౌత్య ఒత్తిడితో పాక్ వెనుదిరిగింది.

### ఇకపై ఇది మర్చిపోలేనిది!

జూలై 14న భారత్ విజయాన్ని అధికారికంగా ప్రకటించగా, జూలై 26న చివరి పాక్ సైనికుడిని గడప దాటి తరిమికొట్టి విజయ్ దినోత్సవంగా నిలిపారు. ఈ యుద్ధంలో 500కు పైగా భారత జవాన్లు అమరులయ్యారు.

వీరందరి త్యాగమే దేశాన్ని నిలిపింది. వారి ధైర్యాన్ని, త్యాగాన్ని నేటి యువత గుర్తుంచుకుని, దేశభక్తి భావనను మనసులోనూ, జీవితంలోనూ నిలిపుకోవాలి.

సేకరణ, వ్యాస రచన
జర్నలిస్ట్ చిక్కిరి శ్రీకాంత్



# ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై అమ్రాబాద్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు



**అమ్రాబాద్,జులై 26( నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అమ్రాబాద్ మండల కేంద్రంలో హుజరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలంగాణా సీఎం రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు అమ్రాబాద్ పోలీస్ స్టేషన్లో సీఐ శంకర్ నాయక్ కు ఫిర్యాదు చేయడం జరిగింది తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని,కించపరుస్తూ పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడడం చట్ట విరుద్ధమని ఇలాంటి అసత్య ఆరోపణలను తెలంగాణ ప్రజలను గందరగోళానికి గురి చేయడం మరియు శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం అదేవిధంగా ప్రజలను తప్పుదోవ పట్టించడం ముఖ్యమంత్రిపై చేసిన వాక్యలు ఉపసంహరించుకొని, సీఎం కి క్షమాపణ చెప్పాలి, లేనియెడల పాడి కౌశిక్ రెడ్డి పై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్యూఐ నాయకులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్యూఐ నాగర్ కర్నూలు జిల్లా అధ్యక్షులు సంతోష్ నాయక్, మండల యూత్ అధ్యక్షులు మండలి శివ, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, లడ్డు యాదవ్, అవుట వెంకటేష్ ,యూత్ కాంగ్రెస్ నాయకులు, హనుమంతు, బియ్యని అనిల్, ప్రభాకర్, రమేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# హైదర్‌నగర్ డివిజన్‌లో భారీ వర్షాలకు స్పందనగా మౌలిక సదుపాయాల పనులు వేగవంతం



**హైదర్‌నగర్, జూలై 26(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్ హైటెన్షన్ లైన్ మరియు లేక్ వ్యూ కాలనీ మెయిన్ రోడ్ వద్ద, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రోడ్లపై నిలిచిన నీటిని మోటార్ సాయంతో తొలగించే పనులను జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం మరియు హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ యాసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)తో కలిసి, డివిజన్ గౌరవ కార్పొరేటర్ శ్రీ నార్నె శ్రీనివాస రావు దగ్గరుండి పరిశీలించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీ నార్నె శ్రీనివాస రావు మాట్లాడుతూ, వర్షాకాలంలో రోడ్లపై నీరు నిల్వకుండా ఉండేందుకు హైడ్రా ప్రత్యేక చర్యలు చేపట్టిందని, ప్రజలకు మరియు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తక్షణమే నీటిని మళ్లించే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.అలాగే, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, రోడ్ల బాగోగులు, గుంతల భర్తీ వంటి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా, రవాణా వ్యవస్థ సజావుగా కొనసాగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బల్దియా ఇంజనీరింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ మహదేవ్, హైడ్రా టీం సూపర్వైజర్ గురు, డివిజన్ నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలంటూ సీపీఐ నేతల వినతి



**కరీంనగర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇండ్లు లేని అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి నేతృత్వంలో కరీంనగర్ జిల్లా సీపీఐ ప్రతినిధులు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి మరియు జిల్లా ఇంచార్జీ తుమ్మల నాగేశ్వరరావుకు శనివారం హైదరాబాద్ సచివాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ అందె స్వామి, చిగురుమామిడి మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు చాడ శ్రీధర్ రెడ్డి, మండల సహాయ కార్యదర్శి బూడిద సదాశివ పాల్గొన్నారు.ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ, చిగురుమామిడి మండలంలో అనేకమంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు మరియు ఆర్థికంగా వెనుకబడిన ఓసీలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాలేదని, వారు సొంత స్థలాలు కలిగి ఉన్నప్పటికీ ఆర్థికంగా ఇల్లు నిర్మించలేని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం అసలైన అర్హులను గుర్తించి మరిన్ని ఇండ్లు మంజూరు చేయాలని ఆయన మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.ఈ విషయంపై స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, గుడిసెల్లో నివసించే అసలైన అర్హులకు ఇండ్లు మంజూరు చేస్తున్నామని, అలాంటి వారు తమ దృష్టికి వస్తే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# కల్వకుర్తి నియోజకవర్గంలో 15 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**కల్వకుర్తి, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని జూపల్లి గ్రామంలో శనివారం ఉదయం, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మరియు రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యుడు బాలాజీ సింగ్ కలిసి 15 కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జూపల్లి నుండి నెమలిగుట్ట తాండ వరకు 3.2 కిలోమీటర్ల బీటీ రోడ్డును 2.70 కోట్ల ఎస్టీఎస్డీఎఫ్ నిధులతో ప్రారంభించారు. అలాగే జూపల్లి నుండి వంగూర్ గేట్ వరకు మరో 3.2 కిలోమీటర్ల బీటీ రోడ్డుకు 9 కోట్ల ఆర్ &బి నిధులతో శంకుస్థాపన చేశారు. కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌లో 49 లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్ మరమ్మతులు, 2.70 కోట్లతో రూఫింగ్ షెడ్ నిర్మాణానికి కూడా శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయ్ కుమార్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మోతిలాల్ నాయక్, యెన్నం భూపతిరెడ్డి, మట్ట వెంకటయ్య గౌడ్, పర్వత రెడ్డి, కొయ్యల పుల్లయ్య, రాములు యాదవ్, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సూచన

**రామగుండం, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలో అకాల వర్షాల నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సూచించారు. అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎగువ మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో ప్రాణహిత నది ఉదృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ ఇంచార్జి కమిషనర్ అరుణ శ్రీతో ఫోన్ ద్వారా మాట్లాడినట్లు తెలిపారు.రెవిన్యూ, పోలీస్, ఇతర శాఖల అధికారులకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, అత్యవసర పరిస్థితుల్లో తన నెంబర్‌కు ఫోన్ చేయాలని ప్రజలకు సూచించారు. ప్రజల భద్రతే తనకు ప్రథమ కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు.

# జమ్మికుంట రూరల్‌లో పదవ తరగతి విద్యార్థులకు మోదీ కానుకగా సైకిళ్ల పంపిణీ




**జమ్మికుంట, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని "మోదీ కానుక"గా ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా జమ్మికుంట రూరల్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శనివారం రోజున సైకిళ్లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద కుటుంబాల నుండి వచ్చిన విద్యార్థులు రవాణా సౌకర్యాల లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులతో కొనుగోలు చేసిన సైకిళ్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో దాదాపు 20 వేల సైకిళ్లను దశలవారీగా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు సురక్షితంగా, సౌకర్యవంతంగా పాఠశాలకు వెళ్లేందుకు ఈ కార్యక్రమం ఉపయుక్తంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సంపెల్లి సంపత్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు, ఓబీసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, మండల ప్రధాన కార్యదర్శి పుల్లూరు ఈశ్వర్, మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు గిరవేణి ఐలయ్య యాదవ్, మండల కార్యదర్శి సమ్మయ్య, ఇల్లందు రాజమల్లు, బూత్ అధ్యక్షులు గుడ్ల రాజు, రవి, శ్రీను, రాకేష్, ప్రధానోపాధ్యాయులు సమ్మయ్య సార్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# గుడి స్థలాన్ని కబ్జా చేశారంటూ ఆలయ దాత ఆవేదన



**చేవెళ్ల, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం తంగడపల్లి గ్రామంలో ఎల్లమ్మతల్లి ఆలయ స్థలాన్ని కబ్జా చేశారంటూ ఆలయ దాత వడ్డే సత్యనారాయణ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 35 ఏళ్లుగా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్న గుడికి తాళం వేసి, భూమిని ఆక్రమించారని ఆయన ఆరోపించారు. తంగడపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 118, 119లో వడ్డే కుటుంబానికి 10 ఎకరాల 30 గుంటల భూమి ఉండగా, వడ్డే వెంకటయ్య 35 సంవత్సరాల క్రితం స్వంతంగా ఎల్లమ్మతల్లి ఆలయాన్ని నిర్మించారు. భక్తుల సౌకర్యార్థం స్వంత డబ్బులతో బోరు వేయించి, ప్రధాన రహదారికి ఆనుకుని ఉండే గుడిలో ప్రతి సంవత్సరం బోనాలు, మొక్కులు నిర్వహించేవారు. సమీప గ్రామాల ప్రజలు నిత్యం అమ్మవారిని కొలిచేవారు. కొన్నేళ్ల క్రితం వెంకటయ్య 10 ఎకరాల 28 గుంటల భూమిని విక్రయించినా, గుడి ఉన్న రెండు గుంటల స్థలాన్ని మాత్రం అమ్మలేదని సత్యనారాయణ తెలిపారు. అయితే నగరానికి చెందిన డాక్టర్ అనిల్ ఆ స్థలాన్ని కూడా కబ్జా చేసి, గుడికి తాళం వేసి, చేతిబోరును తొలగించి తన పొలానికి మోటార్ వాడుతున్నారని ఆరోపించారు .ఈ సంవత్సరం బోనాల పండుగ సందర్భంగా తంగడపల్లికి వచ్చిన సత్యనారాయణ కుటుంబం గుడి వద్దకు వెళ్లగా, గుడి చుట్టూ ఫ్రీ కాస్ట్ వేసి ఉండటంతో గుళ్లోకి వెళ్లి పరిశీలించారు. విషయం తెలుసుకున్న డాక్టర్ అనిల్ పోలీసులకు ఫిర్యాదు చేసి, ఎవరైనా గుళ్లోకి వెళ్లాలంటే తన అనుమతి తీసుకోవాలని ఖరాఖండిగా చెప్పారని సత్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. అనిల్ ఫిర్యాదుతో చేవెళ్ల పోలీసులు గుడి వద్దకు వెళ్లొద్దని, సమస్య పరిష్కారం అయ్యే వరకు పూజలు చేయవద్దని హెచ్చరించారని వాపోయారు. గుడి ముందు నిలబడితే కూడా పోలీసులచేత గెంటివేయిస్తున్నారని తెలిపారు. "35 ఏళ్లుగా అమ్మవారికి పూజలు చేస్తున్నాం. ఇప్పుడు పూజలు చేయడానికి అనుమతులు తీసుకోవాలన్న పరిస్థితి బాధాకరం. నాకు న్యాయం చేయాలి" అంటూ వడ్డే సత్యనారాయణ కన్నీటి పర్యంతమయ్యారు.

# ఆమనగల్లు కోర్టును సందర్శించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి








**ఆమనగల్లు, జూలై 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును శుక్రవారం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్ సందర్శించారు. జిల్లా జడ్జిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా ఆమనగలుకు వచ్చిన ఆయనకు స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండే కార్ యాదిలాల్, బార్ సభ్యులు, న్యాయవాదులు ఘన స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమనగల్లు కోర్టుకు ఐదు ఎకరాల స్థలం కేటాయింపు, నూతన భవనాల నిర్మాణం, సబ్ కోర్టు ఏర్పాటు, షాద్ నగర్ లో కొనసాగుతున్న జిల్లా కోర్టును ఇబ్రహీంపట్నంకు మార్పు వంటి అంశాలపై న్యాయవాదులు విన్నవించారు. న్యాయమూర్తి కర్ణ కుమార్ స్పందిస్తూ, ప్రస్తుతం కోర్టు కొనసాగుతున్న స్థలం అనుకూలంగా ఉందని, అందులో మూడు ఎకరాలు కేటాయించేలా చూడాలని తహసిల్దార్ లలితకు సూచించారు. భవనాల నిర్మాణానికి హైకోర్టుకు సిఫార్సు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్తీక్, సీఐలు జానకిరామ్ రెడ్డి, గంగాధర్, వేణుగోపాల్, ఎస్సైలు వెంకటేష్, చచంద్రశేఖర్, శ్రీకాంత్, శేఖర్, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు జగన్, ఆంజనేయులు, రామకృష్ణ, మధు, మల్లేష్, శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ విద్యార్థి సదస్సుకు కరీంనగర్ నుంచి భారీగా తరలివెళ్లిన బీఆర్ఎస్వీ నాయకులు



**కరీంనగర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హైదరాబాద్ మల్లాపూర్ వీఎన్ఆర్ కన్వెన్షన్‌లో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి విద్యార్థి సదస్సుకు కరీంనగర్ జిల్లా నుంచి దాదాపు 200 మంది విద్యార్థి నాయకులు తరలివెళ్లారు. మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ నేతృత్వంలో ఈ బృందం సమావేశానికి హాజరైంది. ఈ సదస్సులో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీష్ రావు, జగదీష్ రెడ్డి, దేశపతి శ్రీనివాస్ ముఖ్య వక్తలుగా పాల్గొని విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. నాలుగు సెషన్లలో వివిధ అంశాలపై చర్చ జరిపారు. రాబోయే రోజుల్లో విద్యార్థి నాయకులు అనుసరించాల్సిన విధివిధానాలను ఖరారు చేశారు. కరీంనగర్ నియోజకవర్గానికి చెందిన విద్యార్థి నాయకుల ఏర్పాట్లను మాజీ మంత్రి గంగుల కమలాకర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో శాతవాహన విశ్వవిద్యాలయ బీఆర్ఎస్వీ ఇంచార్జ్ చుక్కా శ్రీనివాస్, పెద్దపెల్లి కోఆర్డినేటర్ కొయ్యడ సతీష్ గౌడ్, రాష్ట్ర నాయకులు బందారపు అజయ్ కుమార్ గౌడ్, ఆరే రవి గౌడ్, పటేల్ శ్రవణ్ రెడ్డి, సోమిరెడ్డి నరేష్ రెడ్డి, వడ్లకొండ పర్శరాములు, కుమార్ యాదవ్, శ్రీకాంత్ గౌడ్, అంజి, అన్వేష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు అభివృద్ధిపై బీజేపీ ఆందోళన



**పటాన్చెరు, జూలై 26(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పటాన్చెరు నియోజకవర్గంలోని ప్రధాన రహదారి ఆరేళ్లుగా అభివృద్ధికి నోచుకోకపోవడంతో బీజేపీ నాయకులు నిరసన చేపట్టారు. మండల అధ్యక్షుడు కావలి వీరేశం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి పాల్గొన్నారు. ఇంద్రేశం, కంజర్ల, కంచెర్ల, శివానగర్, దౌల్తాబాద్, జిన్నారం వరకు రహదారి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రతాపరెడ్డి, అల్లం రాజిరెడ్డి, జగన్ రెడ్డి, రవీందర్, ధనుంజయ, బాలకృష్ణ యాదవ్, గణపతిరాజ్, సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మానసా దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు.



**ఎలిగేడు, జూలై 26(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడు మండలం ధూళికట్ట గ్రామంలో పంబాల కులస్తులు శ్రావణ మాసం మొదటి శనివారం కావటంతో శ్రీ స్వయంబు మానస దేవి ఆలయం లో ఘనంగా పూజలు నిర్వహించారు ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని మొక్కులు తీసుకుని స్వీట్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా మాజీ సైనికులకు ఘన సన్మానం




**కరీంనగర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జూలై 26న జరుపుకునే కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా రాజరాజేశ్వరి లైన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో శనివారం కొత్తపల్లి హవేలీ పట్టణంలో మాజీ సైనికులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నా రెడ్డి ఇంద్రాకర్ రెడ్డి, ధ్యావనపల్లి అనిల్, మందల అమరేందర్ రెడ్డి, మావిశెట్టి రమేష్, యాళ్ల మహేందర్ రెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు నరహరి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, 1999లో పాకిస్తాన్ సైన్యం దొంగచాటుగా ఆక్రమించిన భారత భూభాగాన్ని కేంద్ర ప్రభుత్వం "ఆపరేషన్ విజయ్" ద్వారా రెండు లక్షల సైనిక బలగాలతో తిరిగి స్వాధీనం చేసుకుని జూలై 26న టైగర్ హిల్స్ పై జాతీయ పతాకాన్ని ఎగురవేసిందని గుర్తుచేశారు. యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్లకు నివాళిగా ప్రతి సంవత్సరం జూలై 26న కార్గిల్ విజయ్ దివస్ నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి బండ కిషన్ రెడ్డి, బోర్డు సభ్యులు బండ గోపాల్ రెడ్డి, గుండేటి రామచంద్రం, లంబు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శాతవాహన యూనివర్సిటీలో 11 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన



**కరీంనగర్, జూలై 26(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
విద్య రంగ అభివృద్ధికి కట్టుబడిన రాష్ట్ర ప్రభుత్వం, శాతవాహన యూనివర్సిటీలో రెండూ కీలక పనులకు శంకుస్థాపన చేసింది. పరిపాలన విభాగం మొదటి అంతస్తు నిర్మాణానికి 9 కోట్లు, అంతర్గత నీటి సరఫరా పైప్‌లైన్ ఏర్పాటుకు 2.10 కోట్లు కేటాయించారు. పునర్నిర్మిత ఆడిటోరియాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ పమేలా సత్పతి, వీసీ ఉమేష్ కుమార్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. కేంద్ర విద్యాలయాలు, మోడల్ స్కూల్‌లు, రైల్వే సేవలతో విద్యా రంగానికి మద్దతు ఇచ్చిన తన ఎంపీకాలాన్ని మంత్రి గుర్తు చేసుకున్నారు. విద్యకు పార్టీలకు అతీతంగా సేవ చేస్తానంటూ, మంత్రి విద్యార్థులకు స్కిల్స్ ద్వారా లక్షల రూపాయల ఉపాధి అవకాశాలు లభిస్తాయని సూచించారు. భాషలు నేర్చుకోవడంలో సమతుల్యత పాటిస్తూ, పోటీ ప్రపంచంలో ముందుకు సాగాలన్నారు. శాతవాహనుల వారసత్వాన్ని నిలుపుతూ, కరీంనగర్‌లో విగ్రహ ఆవిష్కరణ, ఉత్సవాల నిర్వహణపై దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. శాతవాహన యూనివర్సిటీకి లా, ఫార్మసీ, ఇంజినీరింగ్ కాలేజీలు తేవడంపై హర్షం వ్యక్తంచేశారు.

# కరీంనగర్ ప్రజలారా ఆలోచించండి!



**కరీంనగర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రేకుర్తి జగిత్యాల రోడ్డులో ముదిరాజ్ కాలనీకి వెళ్లే మార్గంలో గత మూడు సంవత్సరాలుగా తారు రోడ్డు పైన ఏర్పడిన గుంతలు ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారాయి. మెయిన్ రోడ్డుపై ఏర్పడిన ఈ గుంతలు, సంబంధిత రోడ్డు రవాణా శాఖ అధికారుల నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గత పది సంవత్సరాల టీఆర్ఎస్ పరిపాలన కాలంలో ఈ రోడ్డు పరిస్థితి మారలేదని, అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు పూర్తయినప్పటికీ, ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టకపోవడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది.ఈ మార్గంలో నిత్యం ప్రయాణించే ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని, రోడ్డు పరిస్థితి వలన నడవడానికి, వాహనాలు నడిపేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు భారతీయ జనతా పార్టీ తరఫున, రేకుర్తి గ్రామ ప్రజల తరఫున ప్రభుత్వ ఉన్నతాధికారులకు మరియు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి దుర్గం మారుతి నేతకాని తెలిపారు. ప్రజల భద్రత కోసం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## యూరియా కోసం రైతుల కష్టాలు..

లావణ్య జగన్
కాంగ్రెస్ పాలనలో యూరియా కోసం తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న రైతులు



**తుక్కుగూడ,జులై 26 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపాలిటీ లో.. విలేకరులకు అందజేసిన ప్రకటనలో... బిఆర్ఎస్ పార్టీ మహిళ ఉప అధ్యక్షురాలు లావణ్య జగన్ మాట్లాడుతూ.... రంగారెడ్డి జిల్లా %ద%వికారాబాద్ జిల్లా లో గత కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు తమ పంట పొలాల్లో పెట్టిన పంటలకు యూరియా ప్రభుత్వం సరైన స్థాయిలో అందించకపోవడంతో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా చంటి బిడ్డలతో రోడ్లపై లైన్లో నిలబడి తమ పోలాలకు ఎరువులు తీసుకుపోతున్నారు. ప్రభుత్వం ముందు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది ఇంత కష్టపడి లైన్లో నిలబడినప్పటికీ ఒకటి రెండు బ్యాగుల కంటే ఎక్కువ దొరకడం లేదని రైతులు వాపోయారు.

## డీఎస్పీ మహేష్ సేవలను స్మరించుకున్న బండి సంజయ్



**కరీంనగర్,జులై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
హుజురాబాద్ ఏసీపీ మాధవి నివాసానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శనివారం వెళ్లి, ఇటీవల మరణించిన ఆమె భర్త డీఎస్పీ జీదుల మహేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.ఈ సందర్భనలో బండి సంజయ్‌తో పాటు మాజీ మేయర్ సునిల్ రావు కూడా పాల్గొన్నారు. మహేష్‌తో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్న మంత్రి, మాధవిని ఓదార్చారు.మహేష్ కుమారులకు ధైర్యంగా ఉండి చదువులో మంచి ప్రగతి సాధించాలని సూచించారు. మహేష్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

## ఎన్సీసీ "ఏ" సర్టిఫికెట్లతో విద్యార్థుల్లో దేశభక్తి స్ఫూర్తి



**కరీంనగర్, జూలై 26(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో 46 మంది ఎన్సీసీ కెడెట్లకు "ఏ" సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక బాధ్యతలు పెంపొందించడమే లక్ష్యమన్నారు. పాఠశాలలో ఎన్సీసీ కార్యకలాపాలు దిగ్విజయంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

# బచ్చుపల్లిలో పల్లవి స్కూల్ లో ఘనంగా గ్లోబల్ విలేజ్, గ్లోబల్ పీస్ సమ్మిట్..






❍ వాతావరణ మార్పులపై చైతన్యం, శాంతియుత ప్రపంచం కోసం సమిష్టి సంకల్పం...


**బచ్చుపల్లి, జూలై 25(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రపంచం మొత్తం శాంతియుత సమాజంగా రూపాంతరం చెందాలన్న లక్ష్యంతో, మరియు వాతావరణ పరిరక్షణ పట్ల జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చైతన్యం పెంచేందుకు, గ్లోబల్ విలేజ్ & గ్లోబల్ పీస్ సమ్మిట్ శనివారం హైదరాబాద్ బచ్చుపల్లిలోని పల్లవి స్కూల్ లో అత్యంత వైభవంగా జరిగింది.ఈ సమ్మిట్‌లో ప్రముఖ విద్యావేత్త, పర్యావరణవేత్త, టిఆర్ఎస్ ఏంఏ జాతీయ సలహాదారు, పర్యావరణ పరిరక్షణ మరియు అభివృద్ధి మండలి జాతీయ సలహాదారు, మరియు లోటస్ లాప్ పబ్లిక్ స్కూల్స్ చైర్మన్ డా. లయన్ కొమటిరెడ్డి గోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ముఖ్యోపన్యాసం చేశారు. వాతావరణ మార్పుల తీవ్రత, తరం నెట్‌వర్క్‌లో శాంతిని ఎలా పెంపొందించాలి, మరియు 2028లో భారత్ సిఓపి 33 క్లైమేట్ కాన్ఫరెన్స్‌కు ఎలా సిద్ధం కావాలో ఆయన పాఠశాల విద్యార్థులకు, యువతకు స్పష్టంగా వివరించారు. 'గ్రీనర్ వరల్డ్, క్లీనర్ వరల్డ్, బెటర్ వరల్డ్, పీస్‌ఫుల్ వరల్డ్" అనే నాలుగు మూల సూత్రాలపై దృష్టి కేంద్రీకరించాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో శ్రీమతి అభిలాష, తెలంగాణ రాష్ట్ర డీజీపీ ముఖ్య అతిథిగా
శ్రీమతి గీతా భాస్కర్, ప్రముఖ సినీనటి సుశీల్ కుమార్, స్కూల్ డైరెక్టర్ శ్రీమతి వీపీ సుధారాణి, ప్రిన్సిపల్ శ్రీమతి సుధా రాణి, 10 టివి ఎడిటర్ కిరణ్ రెడ్డి, బాస్కెట్‌బాల్ కోచ్ శ్రవణ్, సీనియర్ ప్రొడ్యూసర్ సుమన్ టీవీ మరియు పలు రంగాల్లోని ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సమ్మిట్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది అంతర్జాతీయ యూత్ లీడర్షిప్ సంస్థ ఆధ్వర్యంలో గ్లోబల్ విలేజ్ కార్యక్రమం. ఇందులో ఇండోనేషియా, ఈజిప్ట్, కెమెరూన్, శ్రీలంక, నెదర్లాండ్స్, టర్కీ, అల్జీరియా సహా పది దేశాల యువ నాయకులు పాల్గొని తమ దేశాల సంస్కృతిని ప్రతినిధీకరించారు. వారు ఒకే వేదికపై ప్రపంచ పౌరులుగా నిలబడి, సామూహిక అభివృద్ధి, సహజీవనం, మరియు పర్యావరణ పరిరక్షణ పట్ల తమ నిబద్ధతను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వెయ్యులాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు పాల్గొని క్రింది అంశాలలో చురుకైన పాత్ర పోషించారు. విభిన్న దేశాల సాంస్కృతిక ప్రదర్శనలు – గ్లోబల్ కల్చరల్ యూనిటీకి ఉదాహరణగా ప్యానెల్ చర్చలు – ప్రపంచ శాంతి, పర్యావరణ సమస్యలపై ఇంటరాక్టివ్ ప్రదర్శనలు – పర్యావరణ అవగాహన పెంపొందించేందుకు ఈ సమ్మిట్‌ను ప్రత్యేకతగా నిలబెట్టిన ఘట్టం గ్లోబల్ ఓత్ సెరిమనీ. అందులో **పాల్గొన్నవారంతా కింది మౌలిక విలువలపై ప్రమాణం చేశారు:**

-హరిత ప్రపంచం కోసం
-శుభ్రమైన భూమి కోసం

మెరుగైన సమాజం కోసం శాంతియుత ప్రపంచం కోసం ఈ సమ్మిట్ ఒక తాత్కాలిక కార్యక్రమంగా కాకుండా, భవిష్యత్తు తరాలకు ప్రేరణనిచ్చే విశ్వ స్థాయి ఉద్యమంగా నిలిచింది.
పరిశుద్ధ విద్య, మానవత్వం, మరియు పర్యావరణ పట్ల గౌరవం కలిగి ఉన్న యువతతో భవిష్యత్తు కోసం శాశ్వత మార్గాన్ని ఏర్పరిచే మొదటి అడుగుగా ఇది నిలిచింది.
బచ్చుపల్లి నుండి ప్రపంచానికి పర్యావరణ న్యాయం మరియు శాంతికి మార్గం చూపే ఈ సమ్మిట్, తరం తరాల వరకు స్ఫూర్తిదాయకంగా నిలవనుంది.

# రాజేంద్రనగర్ మున్సిపాలిటీలో వరుస అవినీతి కేసులు

## ఏసీబీకి చిక్కిన ఐదుగురు









**రాజేంద్రనగర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాజేంద్రనగర్ మున్సిపాలిటీ కార్యాలయం అవినీతికి అడ్డా గా మారిందా అనే సందేహం ప్రజల్లో గుబులెత్తిస్తోంది. ఏసీబీ అధికారులు వరుసగా దాడులు జరుపుతున్నా, ప్రభుత్వ ఉద్యోగులు భయం లేకుండా లంచాలు తీసుకుంటుండటాన్ని చూసి ప్రజలు విస్మయానికి గురవుతున్నారు.తాజాగా, రాజేంద్రనగర్ మున్సిపాలిటీ డిప్యూటీ కమిషనర్ కే. రవి కుమార్ ఏసీబీ అధికారుల చేతికి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఓ హెూటల్‌పై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు 5 లక్షలు డిమాండ్ చేసిన అతడు, 2 లక్షలు స్వీకరిస్తుండగా అధికారులకు చిక్కాడు. ఇదే కార్యాలయంలో గతంలో ఓ వ్యక్తి దగ్గర కొలతల పుస్తకంలో పని నమోదు చేయించేందుకు 50,000 లంచం తీసుకుంటూ పట్టుబడిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకొబా కూడా ఈ వ్యవహారంలో పేరు పొందాడు.ఇటీవలి కాలంలో అదే మున్సిపాలిటీలో పని చేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్ ఎల్. బల్వంత్ రెడ్డి కాంట్రాక్టర్ బిల్లును మంజూరు చేయటానికి 15,000 లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కగా, సర్కిల్ బిల్ కలెక్టర్ సి. మధు మరోక బినామీ ద్వారా 45,000 లంచం తీసుకుంటుండగా అధికారులకు దొరికాడు. అతడు ఓ పరిశ్రమ పన్ను పెంచకుండా ఉండేందుకు 1 లక్ష డిమాండ్ చేసినట్టు సమాచారం.ఇలా ఒకే కార్యాలయంలో వరుసగా ఐదుగురు ఉద్యోగులు ఏసీబీకి చిక్కిన ఘటన ప్రజల్లో ఆగ్రహానికి దారితీస్తోంది. "ఏసీబీ అధికారులే కార్యాలయంలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది" అనే మాటలు ప్రజల్లో వినిపిస్తున్నాయి. వ్యవస్థలో ముడిపడి ఉన్న అవినీతిని నిర్మూలించేందుకు కఠిన చర్యలు అవసరం అనే అంషం ఇప్పుడు మరింత స్పష్టంగా కనిపిస్తోంది.

## కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ఆర్మీ జవాన్‌కు ఘన సన్మానం



**కరీంనగర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
లయన్స్ క్లబ్ ఆఫ్ గోల్డెన్ శాతవాహన ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రిటైర్డ్ ఆర్మీ జవాన్ మానేటి కిషన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. దేశ రక్షణ కోసం ఎముకలు కొరికే చలిలో సేవలందించిన జవాన్ల త్యాగాలను గుర్తు చేస్తూ, అమరులైన వీరులకు నివాళులర్పించారు.ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు లయన్ ననువాల గిరిధర్ రావు మాట్లాడుతూ, "జవాన్లు తమ ప్రాణాలను పణంగా పెట్టి దేశాన్ని కాపాడుతున్నారు. వారి సేవలు మనందరికీ గర్వకారణం" అని పేర్కొన్నారు.కార్యక్రమంలో 19వ డివిజన్ మాజీ కార్పొరేటర్ లయన్ ఎదుల రాజశేఖర్, ఎల్సిఐఎఫ్ లయన్ మానువాడ శంకర్, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ లయన్ చిలుపురి రాములు, థర్డ్ వైస్ ప్రెసిడెంట్ లయన్ బండారి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. జవాన్ల సేవలను స్మరించుకుంటూ, దేశభక్తిని ప్రోత్సహించేలా ఈ కార్యక్రమం సాగింది.

## ట్రాఫిక్ సిబ్బందికి నూతన హెల్మెట్ల పంపిణీ చేసిన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం




**కరీంనగర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బందికి నూతన హెల్మెట్లను అందజేశారు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్. కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి భద్రతా పరిరక్షణగా ఈ హెల్మెట్లు అందించారని తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, "సిబ్బంది భద్రతతో పాటు, విధుల్లో మరింత చురుకుగా పనిచేయగలిగేలా అవసరమైన ఎక్విప్మెంట్ అందించడం పోలీస్ శాఖ బాధ్యత" అని పేర్కొన్నారు. హెల్మెట్లు వంటి రక్షణ పరికరాలు సిబ్బందికి ధైర్యాన్ని, భద్రతను కల్పిస్తాయని వివరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి, ఇన్స్పెక్టర్ కరీముల్లాఖాన్, ఇతర ఉన్నతాధికారులు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# హుస్నాబాద్ లో మంత్రి పొన్నం సుడిగాలి పర్యటన




**హుస్నాబాద్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

హుస్నాబాద్ నియోజకవర్గంలోని చిగురు మామిడి మండల కేంద్రంలోని మహా లక్ష్మి గార్డెన్ వేదికగా పలు సంక్షేమ కార్యక్రమాలు అద్భుతంగా నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో నూతన రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మి చెక్కులు, సీఎంఆర్ఎఫ్ నిధులు, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, స్టీల్ బ్యాంక్ సామాగ్రి, కాటమయ్య రక్షణ కవచాలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్వినీ తానాజీ, లక్ష్మికిరణ్, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. చిగురు మామిడి మండలంలో గత దశాబ్ద కాలంగా రేషన్ కార్డుల మంజూరుకు ప్రజలు ఎదురుచూస్తుండగా, ప్రజా పాలన స్ఫూర్తితో అర్హులందరికీ కొత్తగా 1,727 రేషన్ కార్డులు మంజూరు చేశారు. అదనంగా 3,988 మందిని కార్డుల్లో నమోదు చేశారు. ఈ సందర్భంగా 7 మందికి కళ్యాణ లక్ష్మి చెక్కులు అందించగా, సీఎంఆర్ఎఫ్ కింద 62 మందికి 21,35,000 నిధులు అందించారు. వడ్డీలేని రుణాల రూపంలో 1.26 కోట్ల విలువైన చెక్కులు కూడా పంపిణీ చేశారు. మహిళల భద్రతార్థం 50 మందికి కాటమయ్య రక్షణ కవచాలు అందించారు. ఇటీవల ములకనూరు గ్రామంలో 284 డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయగా, అందులో 400 ఇళ్లు మాత్రమే నిర్మాణం పూర్తి అయ్యాయి. ప్రస్తుతం 341 మందికి ఇందిరమ్మ ఇళ్లు ఎంపిక కాగా, 105 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. మిగిలిన



ఇళ్లు నిర్మాణాలు త్వరలో ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. ఇల్లు నిర్మించడంలో ఇబ్బంది ఎదురవుతున్న వారికి మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయల వరకు రుణాలు కల్పిస్తున్నారు. అలాగే ఉచితంగా 8 ట్రాక్టర్ల ఇసుకను కూడా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని 46 హోటళ్లకు 100 చొప్పున గ్లాసులు పంపిణీ చేసి, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే ప్రయత్నం చేశారు. ఇప్పటికే 20 స్టీల్ బ్యాంక్ యూనిట్లు అందించగా, త్వరలో మరో 17 యూనిట్లు అందించనున్నట్లు చెప్పారు. కోహెడ మండల కేంద్రంలో గవర్నర్ చేతులమీదుగా స్టీల్ బ్యాంక్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ప్లాస్టిక్ వాడకం వల్ల వచ్చే వ్యాధుల నుంచి ప్రజలను రక్షించేందుకు స్టీల్ సామాగ్రి వినియోగంపై ప్రభుత్వ ఆరాటాన్ని వెల్లడించారు. ప్రతి ఇంట్లో కరివేపాకు, నిమ్మ, జామ, మునగ చెట్లు నాటాలనే పిలుపు ఇచ్చారు. ఇల్లు నిర్మించే ప్రతి కుటుంబం ఈ మొక్కలను నాటాలని మంత్రి సూచించారు. మహిళల ప్రయాణ సౌలభ్యం కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం



కల్పించిన ప్రభుత్వం 200 కోట్ల ఉచిత ప్రయాణాలు జరిపిందని వెల్లడించారు. ఆర్టీసీ బస్సులకు మహిళలను యజమానులుగా నియమించడం ద్వారా సామాజిక సమానత్వానికి ఊతమిచ్చారు. పేద ప్రజలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న వడ్లకు 500 బోనస్, సన్న బియ్యం పంపిణీతో సంక్షేమ చైతన్యం నింపుతున్నారు. గురుకులాల్లో మెస్ చార్జీలను పెంచి విద్యార్థుల ఆహార నాణ్యతను మెరుగుపరిచారు. కాంగ్రెస్ ప్రభుత్వం కరెంట్ ఇవ్వదన్న విమర్శలకు ప్రతిస్పందనగా ప్రస్తుతం ప్రజలకు ఎక్కడా ఇబ్బంది లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేస్తోంది. సాగునీరు అందజేస్తూ పంట ధాన్యం కొనుగోలు చేసే దిశగా చర్యలు తీసుకుంటోంది. రేకొండ గ్రామంలో వన మహోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా మంత్రి ఈత, తాటి మొక్కలు నాటి, 97 లక్షల వ్యయంతో రేకొండ నుండి బండారుపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

# కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం

## ○ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు



**కరీంనగర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు తీవ్రంగా స్పందించారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నేతృత్వంలో పలువురు కాంగ్రెస్ నాయకులు కరీంనగర్ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కౌశిక్ రెడ్డి "బిఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుంది" అనే వ్యాఖ్యలు పిచ్చి కలలుగా అభివర్ణిస్తూ, ఆయన మతిస్థిమితం కోల్పోయినట్లయితే మెంటల్ ఆసుపత్రి వైద్యులను సంప్రదించాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై నిరాధార ఆరోపణలు చేసినందుకు కౌశిక్ రెడ్డి ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, కౌశిక్ రెడ్డి వ్యవహార శైలి సభ్య సమాజానికి తలదించుకునేలా ఉందని, ఆయన శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని స్పీకర్‌ను కోరారు. స్పందించకపోతే అసెంబ్లీ ఎదుట నిరాహార దీక్షకు సిద్ధమవుతున్నామని తెలిపారు. కౌశిక్ రెడ్డి పై ఇప్పటికే కేసు నమోదైనట్లు రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ వర్గాలు వెల్లడించాయి .ఆయన వ్యాఖ్యలు ముఖ్యమంత్రి పరువుకు భంగం కలిగించేలా ఉన్నాయని, భవిష్యత్తులో జరగబోయే పరిణామాలకు బిఆర్ఎస్ నాయకత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని కాంగ్రెస్ నేతలు హెచ్చరించారు.

# 39వ డివిజన్‌లో సమస్యలపై మాసం గణేష్ వినతి






**కరీంనగర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

నగరంలోని 39వ డివిజన్ పరిధిలో వరసిద్ధి కాలనీ, శ్రీరామ కాలనీ, పార్వతి నగర్ ప్రాంతాల్లో నెలకొన్న మౌలిక సదుపాయాల సమస్యలపై బీజేపీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ మాసం గణేష్ స్పందించారు. శనివారం నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసి, తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ప్రాంతాల్లో కనీస రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ముఖ్యంగా శ్రీరామ కాలనీలో ట్యాప్ కనెక్షన్లు లేకపోవడం, వర్షాకాలంలో రహదారులు బురదమయమై రాకపోకలకు అడ్డంకిగా మారడం, లోతట్టు ప్రాంతాలు జలమయమవడం వంటి సమస్యలను ప్రస్తావించారు. ప్రజల నిత్య జీవనానికి తీవ్ర అంతరాయం కలిగిస్తున్న ఈ సమస్యలపై మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని మాసం గణేష్ డిప్యూటీ కమిషనర్‌ను కోరారు.

# కొత్తపల్లిలో రోడ్డు సమస్యపై స్పందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్



**కరీంనగర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

కొత్తపల్లి నుండి కొక్కరకుంటకు వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు పూర్తిగా దెబ్బతిని, బస్టాండ్ నుండి రైల్వే బ్రిడ్జి వరకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్న నేపథ్యంలో, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పందించారు. వర్షాన్ని లెక్కచేయకుండా, వర్షంలోనే రోడ్డును స్వయంగా పరిశీలించి, తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్థానిక బీజేపీ నాయకుల అభ్యర్థన మేరకు జరిగిన ఈ పరిశీలనలో, మంత్రి ప్రజల ఇబ్బందులను స్వయంగా గమనించి, తన వ్యక్తిగత సిబ్బందికి సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. వెంటనే అధికారులు స్పందించి, గుంతలు పూయడం ద్వారా రాకపోకలకు తాత్కాలిక ఉపశమనం కల్పించేందుకు చర్యలు ప్రారంభించారు.

# హుస్నాబాద్ లో "మోదీ గిఫ్ట్" సైకిళ్ళు పంపిణీ చేసిన బండి సంజయ్

**హుస్నాబాద్, జులై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ప్రయత్నిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాభివృద్ధే లక్ష్యంగా మేమిద్దరం కలిసి పనిచేస్తున్నామన్నారు. ఇందు భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గంలో త్వరలో నవోదయ స్కూల్ ఏర్పాటుకు చర్చలు ప్రారంభమయ్యాయని, వచ్చే విద్యా సంవత్సరంలో నుంచే అడ్మిషన్లు ప్రారంభించేందుకు సన్నద్ధమవుతున్నామన్నారు. అదే తరహాలో సైనిక్ స్కూల్ ఏర్పాటు కూడా పాలకుల దృష్టిలో ఉందని వెల్లడించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని, విద్యార్థుల ఆరోగ్యం కోసం ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. విద్యార్థుల అభ్యున్నతి కోసం "మోదీ గిఫ్ట్" పేరిట ఉచిత సైకిళ్లను అందిస్తున్న విషయాన్ని ప్రకటించారు. ఇప్పటికే వందలాది పదవ తరగతి విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. "ప్రభుత్వ పాఠశాలల్లో చదవండి%ౌ% సైకిల్ బహుమతిగా పొందండి" అని పిలుపునిచ్చారు. ఈ ఆలోచనకు మూలకారణం నిర్మల్ జిల్లాలో జరిగిన సంఘటనే. పాదయాత్ర సందర్భంగా ఓ బిడ్డకు స్కూల్‌కు వెళ్ళేందుకు సైకిల్ లేకపోవడం




చూసి వెంటనే అందించామన్నారు. ఆ ఆనందం చూసిన తరువాతే ప్రతి విద్యార్థికి సైకిల్ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. విద్యకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం, కష్టపడి చదివిన విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరగలరని కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, పోలీస్ కమిషనర్ లను ఉదాహరణగా పేర్కొన్నారు. మరియు త్వరలోనే నర్సరీ నుండి 6వ తరగతి చదువుకునే విద్యార్థులందరికీ బ్యాగు, స్టీల్ వాటర్ బాటిల్, నోట్ బుక్స్, పెన్ను, పెన్సిల్ తో కూడిన "మోదీ కిట్స్" అందించనున్నట్లు తెలిపారు. ఈ కిట్లు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని పెంపొందించడమే కాదు, చదువును ఆర్థిక భారంగా భావించే తల్లిదండ్రులకు ఉపశమనం కలిగించనున్నాయి. కార్గిల్ దివస్ సందర్భంగా సైనికుల త్యాగాలను గుర్తు చేశారు. "వాజ్‌పేయి సమయంలో దేశం సైనికుల ధైర్యాన్ని చూసింది. ఇప్పుడు మోదీ నాయకత్వంలో ఉగ్రవాదుల వెన్నులో వణుకు పుట్టిస్తున్నారు" అన్నారు. దేశ భద్రత, విద్యా రంగంపై మోదీ ప్రభుత్వం చూపుతున్న చిత్తశుద్ధిని గుర్తుచేశారు. 2014-15లో యూపీఏ ప్రభుత్వం విద్యా రంగానికి కేవలం ?68,728 కోట్లు కేటాయిస్తే, ఈ ఏడాది మోదీ ప్రభుత్వం ?1,28,650 కోట్లను కేటాయించడం అభినందనీయం అన్నారు. గత 11 సంవత్సరాల్లో విద్యా రంగానికి ?8 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేయడం ద్వారా చిత్తశుద్ధిని నిరూపించినట్లు వివరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ పాలకత్వంలో ప్లాస్టిక్ నిర్మూలన దిశగా "స్టీల్ బ్యాంక్" వ్యవస్థను ప్రారంభించడం స్ఫూర్తిదాయకమన్నారు. నవోదయ స్కూల్ కోసం ఢిల్లీకి వచ్చి వినతి తెలిపినప్పటికీ, మంజూరునకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ విధంగా హుస్నాబాద్ విద్యా రంగం నూతన ఒరవడిలోకి అడుగుపెడుతోంది. పిల్లలు తెల్ల పేపర్ లాంటి వారు. వారు నేర్చుకునేదాన్ని అలవడించుకుంటారు. విద్యార్థులకు ఉన్నత ఆశయాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ప్రతి తల్లిదండ్రుడు తమ పిల్లలపై ఉన్న ఆశలను స్థిరంగా పోషిస్తూ, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం విద్యను ప్రతి ఇంటికి తీసుకెళ్లే లక్ష్యంతో ముందుకెళ్తున్నదని మంత్రి బండి సంజయ్ వివరించారు.

# మానకొండూరులో ఆన్‌లైన్ తరగతులకు శ్రీకారం

## విద్య, వైద్య రంగాల్లో మౌలిక మార్పులకు నాంది

**మానకొండూరు, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ఇల్లంతకుంట మండలంలోని రహింఖాన్‌పేట గ్రామంలో తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఆన్ అకాడమీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్య, వైద్య రంగాల్లో మౌలిక మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, మోడల్ స్కూళ్లలో ఆన్‌లైన్ తరగతులు ప్రారంభించడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన బోధన అందుతుందని తెలిపారు. సాంకేతికతను వినియోగించుకుంటూ భవిష్యత్తును నిర్మించుకోవాలని



విద్యార్థులకు సూచించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులకు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా దేశవ్యాప్తంగా నిపుణుల బోధనతో ఆన్‌లైన్ తరగతులు అందిస్తున్నామని తెలిపారు. ప్రతి రోజు కనీసం రెండు గంటల పాటు తరగతులు వినాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు గణితం, తెలుగు, ఇంగ్లీష్, అకౌంటింగ్ పాఠాలు బోధించడంతో పాటు, సందేహాల నివృత్తి కూడా చేశారు. అలాగే, దివ్యాంగురాలైన డి. భాగ్యలక్ష్మికి 50,000 రుణం మంజూరు చేసి బ్యాంగిల్ హాల్ ఏర్పాటు చేయడానికి ఆర్థిక చేయూత అందించారు. కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఫోన్ ద్వారా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి వినోద్ కుమార్, సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, తహసీల్దార్ ఎం.ఏ. ఫారుఖ్, ఎంపీడీవో శశికళ, స్థానిక నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పై భగ్గుమన్న కాంగ్రెస్ శ్రేణులు

**హుజూరాబాద్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై చేసిన అనుచిత వ్యాఖ్యలు స్థానికంగా తీవ్ర దుమారాన్ని రేపాయి. ఈ వ్యాఖ్యలపై హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ శ్రేణులు ఐదు మండలాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక, కమలాపూర్ మండలాల్లోని ప్రధాన చౌరస్తాలలో కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కమలాపూర్ మండల కేంద్రంలో గాడిదపై ఆయన చిత్రపటాన్ని ఉంచి ఊరేగింపు నిర్వహించారు. "ఖబర్దార్ కౌశిక్ రెడ్డి" అంటూ నినాదాలు చేశారు.




అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్లలో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు అందజేశారు. నాయకులు మాట్లాడుతూ, రాజకీయ ఓనమాలు నేర్పిన కాంగ్రెస్ పట్ల కౌశిక్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గమని, తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో మహిళలను అడ్డుపెట్టుకొని గెలిచిన ఆయన, ఇప్పుడు అదే మహిళలను ఫోన్ టాపింగ్ పేరిట మరో రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. క్షమాపణ చెప్పకపోతే హుజూరాబాద్ నియోజకవర్గంలో తిరగనియ్యమని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో అన్ని మండలాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళా అధ్యక్షురాల్లు, బ్లాక్ కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్.ఎస్.యూ.ఐ., బీసీ, సేవాదళ్, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గాజాలో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 25 మంది మృతి

**న్యూఢిల్లీ -జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గత 21 నెలలుగా హమాస్ అంతమే లక్ష్యంగా గాజా స్ట్రిప్ పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తోంది. గాజాలోని పలు ప్రాంతాలపై వైమానిక దాడులతో విరుచుకుపడుతోంది. తాజాగా గాజాలోని పలు ప్రాంతాలపై ఐడీఎఫ్ జరిపిన వైమానిక దాడుల్లో కనీసం 25 మంది పాలస్తీనియన్లు మరణించినట్లు గాజా ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. జికిమ్ క్రాసింగ్ సమీపంలో సహాయ ట్రక్కుల కోసం వేచి చూస్తున్న వారిపై ఇజ్రాయెల్ దళాలు వైమానిక, తుపాకీ కాల్పులు జరిపినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో పలువురు గాయపడినట్లు షిఫా ఆసుపత్రి సిబ్బంది వెల్లడించారు. ఇదిలా ఉండగా.. యుద్ధంతో



తల్లడిల్లుతున్న గాజాలో ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. ఆకలితో 100 మందికి పైగా మరణించినట్లు ఐక్యరాజ్యసమితికి చెందిన రిలీఫ్ అండ్ వర్క్స్ ఏజెన్సీ(యూఎన్ ఆర్‌డబ్ల్యూ) తెలిపింది. మరణించిన వారిలో అధికంగా పిల్లలు ఉన్నట్లు పేర్కొంది. గాజాలోని ప్రజలను నడుస్తున్న శవాలుగా అభివర్ణించిన ఏజెన్సీ జోర్డాన్, ఈజిప్టులో తమకు చెందిన 6,000 ట్రక్కుల లోడుతో సమానమైన ఆహార, వైద్య సరఫరాలు నిలిచి ఉన్నాయని తెలిపింది. ఇజ్రాయెల్-హమాస్ మధ్య యుద్ధం అక్టోబర్ 2023లో ప్రారంభమైన విషయం తెలిసిందే. హమాస్ ఇజ్రాయెల్‌లోని అనేక ప్రాంతాలపై దాడి చేసింది. ఈ దాడుల్లో 1200 మందికిపైగా ఇజ్రాయెల్ పౌరులు మరణించారు. ఆ తర్వాత ఇజ్రాయెల్ ప్రతీకారంలో ఇప్పటివరకు 59 వేలకుపైగా పాలస్తీనియన్లు మరణించారు. గాజాలో పెద్ద సంఖ్యలో జనాభా నిరాశ్రయులయ్యారు. వేలాది మంది ఆకలి బాధలను ఎదుర్కొంటున్నారు. గాజాలోని ప్రతి ఐదుగురు పిల్లల్లో ఒకరు పోషకాహార లోపంతో బాధపడుతున్నట్లు తేలింది.

## మరో విమానం ప్రమాదం..


### పైలట్‌తో సహా ఇద్దరు మృతి



**ఇటలీ జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఇటలీలో ఘోర విమానం ప్రమాదం చోటుచేసుకుంది. ఒక చిన్న విమానం హైవేపై కూలింది. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. బ్రెసికా సిటీ సమీపంలో ఈ ఘటన జరిగింది. చిన్న తరహా అల్ట్రాలైట్ ఎయిర్‌క్రాఫ్ట్ ఉన్నట్టుండి రోడ్డుపై కుప్పకూలింది. దీంతో విమానం కూలిన తర్వాత భారీగా మంటలు వ్యాపించాయని స్థానిక అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో పైలట్ సహా ఇద్దరు మృతి చెందాగా.. ఇద్దరు బైకర్లు గాయపడ్డారు. ఆ విమానం రోడ్డును ఢీకొనడం సీసీటీవీ ఫుటేజీలో రికార్డయింది.

## ఆపరేషన్ సింధూర్‌తో పాకిస్థాన్‌కు స్పష్టమైన సందేశం ఇచ్చాం

### -ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది




**ద్రాస్ -జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉగ్రవాదానికి సపోర్టు ఇస్తున్న పాకిస్థాన్‌కు ఆపరేషన్ సింధూర్‌తో స్పష్టమైన సందేశం ఇచ్చామని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది తెలిపారు. కార్గిల్ యుద్ధ సంస్మరణం సందర్భంగా ద్రాస్‌లో జరిగిన విజయ్ దివస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ సింధూర్ తో పాకిస్థాన్‌కు సందేశం ఇచ్చామని, అలాగే పెహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిచర్య అని ఆయన పేర్కొన్నారు. పెహల్గామ్ ఉగ్రదాడి భారత్‌కు తీవ్ర గాయాన్ని ఏర్పర్చిందని, అయితే ఈసారి ఇండియా బాధపడడమే కాదు, ఆ చర్యకు ప్రతీకార చర్యను కూడా చూపించిందన్నారు. ఉగ్రవాదాన్ని సహించేది లేదన్న సందేశాన్ని ఇచ్చామన్నారు. కార్గిల్ యుద్ధ వీరులను స్మరించేందుకు మూడు ప్రాజెక్టులను ఆర్మీ చీఫ్ ప్రారంభించారు. అమరులకు నివాళి అర్పించేందుకు ఈ-శ్రద్ధాంజలి పోర్టల్‌ను ఆయన ప్రారంభించారు. 1999 నాటి కార్గిల్ యుద్ధ గాథలు వినేందుకు క్యూఆర్ కోడ్ ఆడియో గేట్‌వేను కూడా ఆయన ప్రారంభించారు. ప్రతి ఏడాది జూలై 26వ తేదీన కార్గిల్ విజయ్ దివస్‌ను సెలబ్రేట్ చేస్తున్న విషయం తెలిసిందే. కార్గిల్ యుద్ధ వీరుల స్మారకాన్ని విజిట్ చేయకుండానే ప్రజల తమ హీరోలకు ఈ-శ్రద్ధాంజలి ప్రకటించవచ్చు. ప్రజల్లో ఆ నాటి యుద్ధ పరిస్థితులపై చైతన్యం తీసుకువచ్చే ఉద్దేశంతో ఈ-శ్రద్ధాంజలి ప్రారంభించారు. ఇండస్ వ్యూవ్ పాయింట్ అనే ప్రాజెక్టును కూడా లాంచ్ చేశారు. దీని వల్ల విజిటర్స్ ఎల్వోసీ వద్దకు వెళ్లవచ్చు. బటాలిక్ సెక్టార్‌లోని ఎల్వోసీ ప్రాంతాన్ని ఇండస్ వ్యూవ్‌పాయింట్‌తో చూడవచ్చు. కార్గిల్ యుద్ధ సమయంలో బటాలిక్ ప్రాంతం కీలకంగా నిలిచింది. ఇది సుమారు పది వేల అడుగుల ఎత్తులో ఉంది. కార్గిల్, లేహ్, బల్టిస్తాన్ వ్యూహాత్మక లొకేషన్‌లో ఉంది.

## కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన కరీంనగర్ పోలీస్ కమిషనర్



**కరీంనగర్, జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో నగరంలో ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు, కరీంనగర్ మున్సిపల్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను శనివారం సందర్శించారు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాల కారణంగా కొన్ని ప్రాంతాల్లో కాలువలు ఉప్పొంగి రోడ్లపైకి నీరు చేరి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా రోడ్లపై పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. ఎక్కడైనా సమస్య తలెత్తిన వెంటనే ట్రాఫిక్ సిబ్బంది స్పందించి తక్షణమే పరిష్కార చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కరీముల్లాఖాన్, కమిషనరేట్ కంట్రోల్ రూమ్ ఇన్స్పెక్టర్ ఓ. వెంకటేష్, కమాండ్ కంట్రోల్ సిబ్బంది పాల్గొన్నారు. నగరంలో 769 సీసీ కెమెరాల ద్వారా ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను పర్యవేక్షిస్తూ, ప్రజల భద్రతను పెంచే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి.


## హమాస్ కథ ముగించాల్సిందే..

### ఇజ్రాయెల్‌కు ట్రంప్ కీలక సూచన



**న్యూఢిల్లీ – జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాల్పుల విరమణ ప్రతిపాదనను హమాస్ తిరస్కరించడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో స్పందించారు. ఈ మేరకు ఉగ్రవాద సంస్థ హమాస్‌పై విరుచుకుపడ్డారు. హమాస్‌కు శాంతి నెలకొల్పడంపై ఆసక్తిలేదని వ్యాఖ్యానించారు. ఇక హమాస్ కథ ముగించాల్సిందేనని పేర్కొన్నారు. గాజాలో దాడులు తీవ్రతరం చేయాలంటూ ఇజ్రాయెల్‌కు అధ్యక్షుడు సూచించారు. స్కాట్లాండ్ పర్యటనకు వెళ్లే ముందు ట్రంప్ మాట్లాడుతూ.. 'హమాస్‌కు ఎటువంటి డీల్ చేసుకునేందుకు ఇష్టం లేదు. వాళ్లకు శాంతి నెలకొల్పడంపై ఆసక్తి లేదు. వాళ్లు చావాలని కోరుకుంటున్నట్టు ఉంది. ఇది చాలా దారుణం. ఇక దాని కథ ముగించాల్సిందే. గాజా లో మొదలు పెట్టిన పనిని పూర్తి చేయాలి. ప్రక్షాళన చేయండి. దాడులను ఉద్ధృతం చేయండి' అంటూ ఇజ్రాయెల్ కు ట్రంప్ సూచించారు. కాగా, మధ్యప్రాచ్యంలో శాంతి చర్చలకు ప్రాతినిధ్యం వహిస్తున్న అమెరికా ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్ హమాస్‌తో చర్చల నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. ఈ విషయంలో తమ వ్యూహాల్ని సమీక్షించుకునేందుకు ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు తెలిపారు. చర్చల్లో ప్రతిష్టంభనకు హమాస్‌దే బాధ్యత అని స్పష్టం చేశారు. ఇక హమాస్ చెరలో బందీలను విడిపించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నట్టు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నేతన్యాహూ తెలిపారు.

## కారులో ఎత్తుకెళ్లి మైనర్ అమ్మాయిపై అత్యాచారం



**జిరక్‌పూర్ జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మొహాలీలో 16 ఏళ్ల అమ్మాయి ని రేప్ చేశారు. కదులుతున్న కారులోనే అత్యాచారానికి పాల్పడ్డారు. జూలై 23వ తేదీన ఈ ఘటన జరిగింది. చండీఘడ్-అంబాలా జాతీయ రహదారి సమీపంలోని వీఐపీ రోడ్డు మెట్రో మాల్ దగ్గర ఈ ఘటన రాత్రి 8 గంటలకు జరిగింది. సెలూన్‌లో పనిపూర్తి చేసుకుని ఆటోరిక్షా కోసం రోడ్డుపై ఎదురుచూస్తున్న సమయంలో కారులో వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆ అమ్మాయిని బలవంతంగా కారులోకి లాగేశారు. కారు ప్రయాణిస్తున్న సమయంలో ఆమెపై దాడి చేశరు. ఆ తర్వాత నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లారు. ఆమెపై లైంగికంగా దాడికి పాల్పడ్డారు. దాడి సమయంలో బాధితురాలి సోదరుడి పేరును నిందితులు చెప్పినట్లు తెలుస్తోంది. నేరానికి పాల్పడిన తర్వాత మళ్లీ ఆ అమ్మాయిని ఎత్తుకెళ్లిన లొకేషన్‌లో వదిలేశారు. బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిరక్‌పూర్ పోలీసులు కేసు రిజిస్టర్ చేసి విచారణ మొదలుపెట్టారు.

## బీహార్‌లో నేరాలు పెరిగిపోయాయి..

### నితీశ్‌కు మద్దతిచ్చినందుకు చింతిస్తున్నాం

**పట్నా- -జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికల వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. రాష్ట్రంలోని ఎన్డీయే మిత్రపక్షమైన నితీశ్ కుమార్‌పాలనపై కేంద్ర మంత్రి, లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయన్నారు. నేరాలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. ఈ మేరకు అధికారంలోని నితీశ్ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చినందుకు చింతిస్తున్నట్లు వ్యాఖ్యానించారు.



# బిజినెస్

## బ్యాంక్ ఆఫ్ బరోడాకు రూ.4,541 కోట్ల లాభాలు

**హైదరాబాద్ -జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రభుత్వ రంగ విత్త సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా 2025-26 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 1.8 శాతం వృద్ధితో రూ.4,541.3 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.4,458 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.29,628 కోట్ల మొత్తం ఆదాయాన్ని ప్రకటించగా.. గడిచిన క్యూ1లో 4.9 శాతం వృద్ధితో రూ.31,091 కోట్ల ఆదాయాన్ని సాధించింది. బీఓబీ నికర వడ్డీ ఆదాయం 1.4 శాతం తగ్గి రూ.11,435 కోట్లుగా నమోద య్యింది. స్థూల నిరర్థక ఆస్తులు 2.88 శాతం నుంచి 2.28 శాతానికి తగ్గగా.. నికర ఎన్‌పీఏలు 0.69 శాతం నుంచి 0.6 శాతానికి పరిమితమయ్యాయి.

## ఎంజీ నుంచి సైబర్‌స్టర్ ఇవి

### ధర రూ.74.90 లక్షలు

**జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జేఎస్‌డబ్ల్యు ఎంజీ మోటార్ ఇండియా తన సరికొత్త సైబర్‌స్టర్ ఇవి ఎలక్ట్రిక్ స్పోర్ట్స్ కారును ఆవిష్కరించింది. దీని ఎక్స్‌షోరూం ధరను రూ.74.99 లక్షలుగా నిర్ణయించింది. ఇది 3.2 సెకన్లలోనే 1-100 కిలోమీటర్ల గరిష్ట వేగాన్ని పుంజుకోనుంది. 77 కిలోవాట్ బ్యాటరీ కలిగి ఉన్న ఈ కారును ఒక్కసారి చార్జింగ్ చేస్తే 580 కిలోమీటర్లు ప్రయాణించవచ్చని ఆ కంపెనీ తెలిపింది. నాలుగు రంగుల్లో అందుబాటులోకి తెచ్చిన ఈ ఎస్‌యూవీ ఎంజీ సెలెక్ట్ షోరూమ్‌లలో లభిస్తుందని పేర్కొంది.

## దిగి వస్తున్న బంగారం ధరలు..

**జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రపంచ వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గడం, సురక్షితమైన పెట్టుబడికి డిమాండ్ బలహీనపడటం మధ్య బంగారం ధరలు వరుసగా గత మూడు రోజుల నుంచి తగ్గుతూనే ఉన్నాయి. నిన్నటికి ఈ రోజుకు పోల్చుకుంటే శనివారం 24 క్యారెట్ల 10 గ్రాములకు రూ. 300లకుపైగా తగ్గుముఖం పట్టి ప్రస్తుతం తులం ధర 1లక్షా 470 రూపాయలు ఉండగా, అదే 22 క్యారెట్లపై రూ.200 వరకు తగ్గి ప్రస్తుతం తులం ధర రూ.92,090 రూపాయల వద్ద కొనసాగుతోంది. అయితే నిన్నటితో పోల్చితే తాజాగా స్వల్పంగానే తగ్గిందనే చెప్పాలి.
బంగారం ధర ఇంకా ఒక లక్ష రూపాయలు పైనే ఉంది. ఆభరణాలు కొనుగోలు చేసే వారికి ఈ పరిణామం కాస్త ఇబ్బంది కరం అని చెప్పవచ్చు. ముఖ్యంగా బంగారు ఆభరణాలు కొనుగోలు చేయాలి అనుకునే వారికి ఈ ధరలు చుక్కలు చూపిస్తున్నాయని చెప్పవచ్చు. 22 క్యారెట్ల బంగారం ధర కూడా ఏకంగా 93 వేల సమీపం వరకు చేరడంతో బంగారు ఆభరణాలు కొనుగోలు చేసే వారికి జేబు భారం




మరింత పెంచింది. బంగారం ధరలు ఆల్ టైం రికార్డ్ స్థాయిని తాగడానికి ప్రధాన కారణం అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్నటువంటి పరిస్థితులే కారణమని చెప్పవచ్చు. ఇక మరోవైపు వెండి ధర కూడా ఈ రోజు స్వల్పంగా తగ్గింది. ప్రస్తుతం కిలో వెండి ధర 1 లక్షా 17 రూపాయల వద్ద కొనసాగుతోంది. ఇక హైదరాబాద్, చెన్నై, కోల్‌కతాలలో లక్షా 27 వరకు ఉంది. వెండి ధర కూడా రికార్డ్ స్థాయి నుంచి ఏ మాత్రం దిగడం లేదు. వెండి ధర భారీగా పెరగడానికి ప్రధానంగా పారిశ్రామికంగా వెండి డిమాండ్ భారీగా పెరగడమే ఒక కారణమని చెబుతున్నారు నిపుణులు. ఈ నేపథ్యంలో వెండి లో పెట్టుబడి పెట్టే వారి సంఖ్య కూడా భారీగా పెరుగుతుందని చెప్పవచ్చు.

**ఇక దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు:**
ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.10,0620 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.92,240 వద్ద కొనసాగుతోంది.
ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.10,0470 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.92,090 వద్ద కొనసాగుతోంది.
హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.10,0470 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.92,090 వద్ద కొనసాగుతోంది.
చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.10,0470 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.92,090 వద్ద కొనసాగుతోంది.
బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.10,0470 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.92,090 వద్ద కొనసాగుతోంది.
విజయవాడలో24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.10,0470 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.92,090 వద్ద కొనసాగుతోంది.

## ఎఫ్‌టీఏతో భారత్‌కు ప్రయోజనమే

### ఆర్బీఐ గవర్నర్ మల్హోత్రా

**న్యూఢిల్లీ -జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బ్రిటన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదుర్చుకోవడం ద్వారా భారత్‌కు ప్రయోజనమేనని ఆర్‌బీఐ గవర్నర్ సంజరు మల్హోత్రా పేర్కొన్నారు. ఈ ఒప్పందాన్ని తాను స్వాగతిస్తున్నానని చెప్పారు. బీఎఫ్‌ఎస్‌ఐ సమ్మిట్ మల్హోత్రా మాట్లాడుతూ.. ఇరుదేశాలు చేసుకున్న ఈ ఒప్పందం భారత ఆర్థిక వ్యవస్థలోని బహుళ రంగాల అభివృద్ధికి దోహదం చేయనుందన్నారు. ఇతర దేశాలతోనూ భారత్ ఇటువంటి వాణిజ్య ఒప్పందాలు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇటువంటి వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడానికి భారత్ అమెరికాతో సహా పలు దేశాలతో వాణిజ్య చర్చలు కొనసాగిస్తోందని మల్హోత్రా అన్నారు.



## పాకిస్థాన్, వెస్టిండీస్ టీంల కన్నా దారుణంగా..టీమిండియా

### 127 టెస్ట్‌ల్లో కేవలం 2 మ్యాచ్‌ల్లోనే విజయం..

**జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
క్రికెట్‌లో టెస్ట్ మ్యాచ్‌లు అంటే ఓపిక, పట్టుదల, వ్యూహాలకు నిదర్శనంగా చెబుతుంటారు. అయితే, కొన్నిసార్లు మ్యాచ్ గమనం ఊహించని మలుపులు తిరుగుతుంది. ముఖ్యంగా తొలి ఇన్నింగ్స్‌లో ప్రత్యర్థికి భారీ ఆధిక్యం (150 పరుగుల కంటే ఎక్కువ) దక్కినప్పుడు, అక్కడి నుంచి తిరిగి వచ్చి మ్యాచ్ గెలవడం అసాధారణమైన ఘనత. ఈ విషయంలో టీమిండియా రికార్డు చూస్తే, అది అంత మెరుగ్గా లేదని తెలుస్తోంది. గత కొన్నేళ్లుగా, తొలి ఇన్నింగ్స్‌లో 150 పరుగుల కంటే ఎక్కువ ఆధిక్యాన్ని ప్రత్యర్థులకు సమర్పించుకున్న తర్వాత టీమిండియా ఆడిన మొత్తం 127 టెస్టుల్లో కేవలం రెండు సార్లు మాత్రమే విజయం సాధించిందని గణాంకాలు చెబుతున్నాయి. ఈ గణాంకాలు భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఒక బలహీనతను స్పష్టంగా సూచిస్తున్నాయి.

**భారత్ సాధించిన ఆ రెండు అద్భుత విజయాలు..**




ఈ రెండు విజయాలు టీమిండియా చరిత్రలో ప్రత్యేకంగా నిలిచాయి. తొలి ఇన్నింగ్స్‌లో భారీ లోటును అధిగమించి గెలవడానికి అసాధారణమైన పోరాటం, పట్టుదల అవసరం.
2021లో బ్రిస్బేన్ టెస్ట్ (ఆస్ట్రేలియాపై): ఇది భారత క్రికెట్ చరిత్రలో నిస్సందేహంగా అత్యంత గొప్ప విజయాల్లో ఒకటి. అనేక మంది కీలక ఆటగాళ్లు గాయాలపాలై, ద్వితీయ శ్రేణి జట్టుతో బరిలోకి దిగిన భారత్, ఆస్ట్రేలియాకు తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యాన్ని అప్పగించినా, నాలుగో ఇన్నింగ్స్‌లో 300ం పరుగుల లక్ష్యాన్ని ఛేదించి చరిత్ర సృష్టించింది. ఇది యువ ఆటగాళ్ల తెగువ, గొప్ప జట్టు స్ఫూర్తికి నిదర్శనం. 2024లో రాంచీ టెస్ట్ (ఇంగ్లాండ్‌పై): స్వదేశంలో ఇంగ్లాండ్‌తో జరిగిన ఈ టెస్టులో కూడా టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో వెనుకబడినా, చివరికి పుంజుకుని విజయం సాధించింది. ఈ విజయం, ఛేజింగ్‌లో టీమిండియా ఎదుర్కొంటున్న సవాళ్ల మధ్య లభించిన ఒక అరుదైన అవకాశం.

**ఛేజింగ్‌లో టీమిండియా ఎదుర్కొంటున్న సవాళ్లు..**
గత 12 ఏళ్లలో టీమిండియా టెస్టుల్లో 150 పరుగుల కంటే ఎక్కువ లక్ష్యాలను ఛేదిస్తూ కేవలం రెండు సార్లు మాత్రమే విజయం సాధించింది. 26 టెస్టుల్లో ఇలాంటి పరిస్థితి ఎదురవ్వగా, 17 మ్యాచ్‌ల్లో ఓటమి పాలై, 7 మ్యాచ్‌లు డ్రా అయ్యాయి. ఈ గణాంకాలు ఛేజింగ్‌లో టీమిండియాకు ఉన్న బలహీనతను స్పష్టం చేస్తున్నాయి. పాకిస్థాన్, వెస్టిండీస్ వంటి జట్లు కూడా ఈ విషయంలో భారత్ కంటే మెరుగ్గా ఉన్నాయి.

## ఎ మూడేళ్ల తర్వాత సెంచరీ కొట్టిన స్టోక్స్

### ఇంగ్లండ్‌కు భారీ ఆధిక్యం

**జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మాంచెస్టర్ టెస్టులో ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ సెంచరీతో గర్జించాడు. మూడేళ్ల తర్వాత సుదీర్ఘ ఫార్మాట్‌లో అతడు శతకం సాధించడం విశేషం. తొలి సెషన్‌లో సిరాజ్ బౌలింగ్‌లో బౌండరీతో స్టోక్స్ మూడంకెల స్కోర్ అందుకున్నాడు. టెస్టుల్లో ఇంగ్లీష్ సారథికి ఇది 14వ సెంచరీ. అంతేకాదు ఒక టెస్టులో ఐదు వికెట్లు.. ఆపై వందతో చెలరేగిన నాలుగో ఇంగ్లండ్ ఆటగాడిగా స్టోక్స్ రికార్డు సృష్టించాడు. ఈ ఆల్‌రౌండర్ కంటే ముందు వెటరన్ ప్లేయర్లు టోనీ గ్రెగ్, ఇయాన్ బోథమ్(5 పర్యాయాలు), గస్ అట్కిన్సన్‌లు ఈ రికార్డు సాధించారు.ఓల్డ్ ట్రఫోర్డ్ మైదానంలో దంచికొడుతున్న స్టోక్స్ సెంచరీతో పాటు 7వేల పరుగుల క్లబ్‌లో చేరాడు. ఈ ఫార్మాట్‌లో ఈ ఘనత సాధించిన పదమూడో ఇంగ్లండ్ ఆటగాడిగా ఈ ఆల్‌రౌండర్ రికార్డు నెలకొల్పాడు. టెస్టుల్లో 7 వేల



రన్స్.. 200లకు పైగా వికెట్లు తీసిన మూడో ఆటగాడిగా మరో రికార్డు తన పేరిట లిఖించుకున్నాడీ డాషింగ్ బ్యాటర్. గ్యారీ సోబర్స్(8,032 పరుగులు, 235 వికెట్లు), జాక్వెస్ కలిస్(13,289 రన్స్, 292 వికెట్లు)లు మాత్రమే ఈ అరుదైన క్లబ్‌లో ఉన్నారు. ప్రస్తుతం అతడు 107 రన్స్ చేయగా బ్రైడన్ కార్సే(18 నాటౌట్) సమయోచితంగా ఆడుతున్నాడు. 8 వికెట్ల నష్టానికి 603 రన్స్ చేసిన ఆతిథ్య జట్టు 245 పరుగుల ఆధిక్యంలో ఉంది.

**బాదుడే బాదుడు**
సిరీస్‌లో కీలకమైన నాలుగో టెస్టులో ఆతిథ్య జట్టు డ్రైవింగ్ సీట్లో ఉంది. టాపార్డర్ నుంచి మిడిలార్డర్ వరకూ అందరూ రాణించడంతో ఆ జట్టు పటిష్ట స్థితిలో నిలిచింది. రెండో రోజు ఓపెనర్లు బెన్ డకెట్(94), జాక్ క్రాలే(84) శుభారంభమివ్వగా.. మూడో రోజు జో రూట్ (150), ఓలీ పోప్(71)లు విధ్వంసం కొనసాగించారు. సుందర్ వరుస ఓవర్లలో పోప్, హ్యారీ బ్రూక్(3)ను ఔట్ చేసి ఉపశమనం ఇచ్చాడు.కానీ, రూట్ సాయంతో బెన్ స్టోక్స్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. ఇద్దరూ భారత బౌలర్లను పరీక్షిస్తూ పరుగుల పండుగ చేసుకున్నారు. ఈ క్రమంలోనూ రూట్ 38వ సెంచరీ సాధించగా.. స్టోక్స్ హాఫ్ సెంచరీతో మెరిశాడు. మధ్యలో కండరాలు పట్టేయడంతో బ్రేక్ తీసుకున్న అతడు.. ఏడో వికెట్ పడ్డాక క్రీజులోకి వచ్చి బ్యాటింగ్ కొనసాగించాడు. మూడో రోజు అజేయంగా నిలిచి జట్టు కొండంత స్కోర్‌లో భాగమయ్యాడు.

# స్పోర్ట్స్

## ఆ మ్యాచ్ తో టెస్ట్ క్రికెట్ కు బుమ్రా గుడ్ బై ?

### మాజీ క్రికెటర్ సంచలన కామెంట్స్



**జూలై 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జస్ ప్రీత్ బుమ్రా గురించి ఒక సంచలన వార్త బయటకు వచ్చింది. టీమిండియా మాజీ క్రికెటర్ ఒకరు, బుమ్రా టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకోవచ్చని చెప్పారు. దీనికి కారణాన్ని కూడా వివరించారు. లార్డ్స్ టెస్ట్ మ్యాచ్‌లో 7 వికెట్లు తీసిన భారత జట్టు ఫాస్ట్ బౌలర్, మాంచెస్టర్ టెస్ట్ మ్యాచ్‌లో మాత్రం పూర్తిగా తేలిపోయాడు. జస్ ప్రీత్ బుమ్రా ఈ టెస్ట్ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్‌పై ఇప్పటివరకు ఒకే వికెట్ తీశాడు. అతను ఆడుతున్నంతసేపు తన రిథమ్ పట్టుకోవడానికి కష్టపడ్డాడు. ఈ సమయంలో అతను పూర్తిగా ఫిట్‌గా కనిపించలేదు, దీనివల్ల తన లెవల్ కు తగ్గట్లు స్పీడుతో బౌలింగ్ చేయలేకపోయాడు. ఇప్పుడు మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ అతని గురించి షాకింగ్ వ్యాఖ్యలు చేశారు. టీమిండియా మాజీ బ్యాట్స్‌మెన్ మహ్మద్ కైఫ్, జస్ ప్రీత్ బుమ్రా గురించి పెద్ద వ్యాఖ్యలు చేశాడు. బుమ్రా త్వరలోనే టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకోవచ్చని కైఫ్ అన్నాడు. “టీమిండియా ఫాస్ట్ బౌలర్ జస్ ప్రీత్ బుమ్రా రాబోయే టెస్ట్ మ్యాచ్‌లలో ఆడకపోవచ్చు, అతను రిటైర్మెంట్ కూడా తీసుకోవచ్చు” అని కైఫ్ అన్నాడు. బుమ్రా గాయాలతో బాధపడుతున్నాడని, అందుకే అతను తన రిథమ్ లో కనిపించడం లేదని చెప్పాడు. బుమ్రా చాలా ఆత్మగౌరవం ఉన్న వ్యక్తి అని, ఒకవేళ తను నూటికి నూరు శాతం ఇవ్వలేకపోతే, దేశానికి మ్యాచ్‌లు గెలిపించలేకపోతే, అప్పుడు తనే ఆడనని చెప్తాడని నాకు అనిపిస్తుంది అని కైఫ్ అన్నాడు. వికెట్లు తీయకపోవడం ఒక విషయం అయితే, మాంచెస్టర్ టెస్ట్‌లో అతను బౌలింగ్ చేసిన వేగం చాలా తక్కువగా ఉందని కైఫ్ అన్నాడు. మాంచెస్టర్ టెస్ట్ మ్యాచ్‌లో వికెట్ కీపర్ అతని బంతిని అందుకోవడానికి ముందుగా డ్రైవ్ చేసి క్యాచ్ పట్టిన తీరు, బుమ్రా పూర్తిగా ఫిట్‌గా లేడని సూచిస్తుంది. బుమ్రా ఫిట్‌గా ఉంటే, అతను ఎప్పుడు కావాలంటే అప్పుడు వికెట్లు తీయగలడని కైఫ్ అన్నాడు. “బుమ్రాలో ఇప్పటికీ దేశం కోసం ఆడే ప్యాషన్ అలాగే ఉంది, కానీ అతను తన శరీరం, ఫిట్‌నెస్‌తో ఓడిపోయాడు. అతని శరీరం సహకరించడం లేదు. కాబట్టి అతను టెస్ట్ క్రికెట్ ఆడటానికి నిరాకరించవచ్చని నాకు అనిపిస్తుంది” అన్నారు.